# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 2-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 58 | పేజీలు 8 | వెల: రూ.1/-


## బీహార్ వరదల్లో 40 మంది మృతి

పాట్నా, అక్టోబర్1: బీహార్ లోని చాలా ప్రాంతాలు వరద ముంపులో చిక్కుకున్న విషయం తెలిసిందే. పాట్నాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వరదల్లో ఇప్పటివరకు 40 మంది మృతి చెందగా..9 మందికి గాయాలైనట్లు బీహార్ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటించింది. కుండపోత వర్షాలతో వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఐఏఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది.

# రామ్‌నాథ్ కోవింద్‌కు పలువురు శుభాకాంక్షలు

## జన్మదినం సందర్భంగా అభినందనలు తెలిపిన నేతలు

న్యూఢిల్లీ,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): భారత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ మంగళవారం తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖుల నుంచి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో ట్వీటర్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తదితరులు రామ్‌నాథ్ కోవింద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు తెలంగాణ సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రపతి భవన్‌కు ప్రత్యేక సందేశం పంపించారు. రాష్ట్రపతిగా కోవింద్ దేశానికి మరింత సేవ చేయాలని సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రపతి కోవింద్ పరిపూర్ణ ఆరోగ్యంతో, నిండునూరేళ్లు జీవించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు సీఎం సందేశంలో తెలిపారు. ఆయురారోగ్యాలతో ఉంటూ మరిన్ని పుట్టిన్న రోజులు జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా రాష్ట్రపతి రామ్‌నాథ్‌కు ట్విట్టర్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం

హైదరాబాద, అక్టోబర్ 1: రంవీంద్రభారతిలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా జరిగింది. వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ, మైనార్టీ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ.. చాలా ఇళ్లల్లో వృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, వారికి కనీస సౌకర్యాలు కూడా వారి కుటుంబాలు కల్పించలేకపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధుల సమస్యలను గ్రహించి ప్రభుత్వం తరఫున ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో13 లక్షల మంది వృద్ధులకు రూ. 2,016 చొప్పున ఫించను ఇస్తున్నట్లు తెలిపారు. వృద్ధుల హక్కులను కాపాడేందుకు కమిటీలు ఏర్పాటు చేశామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

జిల్లా కేంద్రాల్లోని వృద్ధాశ్రమాలతో పాటు నూతన జిల్లా కేంద్రాల్లోనూ వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వృద్ధులకు వైద్యం, ప్రయాణ రాయితీ కల్పించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి పేర్కొన్నారు. పెద్దవారు సమాజానికి మార్గదర్శకులు, వారికి తగిన గౌరవం ఇవ్వాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకుడు డాక్టర్ సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు వృద్ధులను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీష్, సీపీ అంజనీ కుమార్ పాల్గొన్నారు.

# ఆర్టికల్ 370 రద్దుపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబర్1(ఆర్ఎన్ఎ) : జమ్మూ కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలోని చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నవంబర్ 13వ తేదీకి వాయిదా వేసింది. మంగళవారం ఈ పిటిషన్లపై విచారణను చేపటిటన రాజ్యాంగ ధర్మాసనం అఫిడవిట్లను సమర్పించడానికి కేంద్రం, జమ్మూ కశ్మీరు రాష్ట్ర పాలనా యంత్రాంగానికి ఐదు వారాల గడువు ఇచ్చింది. ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ కోసం జస్టిస్ ఎన్వి రమణ, జస్టిస్ ఎస్కె కౌల్, జస్టిస్ ఆర్ సుభాష్ రెడ్డి, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ గత శనివారం ఏర్పాటు చేశారు. గస్టు 5న ఆర్టికల్ 370ని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడంతోపాటు జమ్మూ కశ్మీరు, లడఖ్‌లను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. ఈ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు అక్టోబర్ 31 నుంచి మనుగడలోకి రానున్నాయి. ఆర్టికల్ 370ని రద్దు చేసిన మరుసటి రోజు ఆగస్టు 6న సుప్రీంకోర్టులో దీన్ని సవాలు చేస్తూ న్యాయవాది ఎంఎల్ శర్మ తొలి పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత నేషనల్ కాన్ఫరెన్స్, జె అండ్ కె పీపుల్స్ కాన్ఫరెన్స్, సిపిఎం నాయకుడు మొహమ్మద్ యూసుఫ్ తరిగమి తదితరులు పిటిషన్లు దాఖలు చేశారు.

# బీజేపీ, శివసేన 'మహా' తొలి జాబితా విడుదల



ముంబై, అక్టోబర్ 1: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థుల తొలి జాబితాను భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఇవాళ ప్రకటించింది. జాబితాలో సీనియర్ నేతలకు స్థానం దక్కగా మహా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్(నాగ్‌పుర్ సౌత్‌వెస్ట్ నియోజకవర్గం నుంచి పోటీ), రాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రకాంత్ పాటిల(కొత్రుద్), శివాజీ మహారాజ్ కుటుంబానికి చెందిన శివేంద్ర సింగ్(సతారా) తదితరులు ఉన్నారు. తొలి జాబితాలో 12 మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించగా..91 మంది తిరిగి టికెట్లు సంపాదించారు. కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన వారికి టికెట్లు కేటాయించారు. ప్రముఖ రాజకీయ నేతలు వినోద్ తావ్‌డే, సుధీర్ ముంగటివార్, ఏక్‌నాథ్ ఖాడ్సేలకు తొలి జాబితాలో చోటు దక్కలేదు. మరోవైపు మిత్రపక్షం శివసేన 124 మందితో తొలి జాబితాను ప్రకటించింది. శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తన తనయుడు ఆదిత్య ఠాక్రేకు పార్టీ ఏబీ ఫామ్‌ను అందజేశారు. ముంబైలోని వర్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆదిత్య ఈనెల 3వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీకి ఈనెల 21న ఎన్నికలు జరగనున్నాయి.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై సుప్రీంకోర్టులో విచారణ..

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై దాఖలైన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఇవాళ విచారణ జరిగింది. కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అనుమతించింది. అరెస్టుకు ముందస్తు అనుమతి తప్పనిసరన్న గత ఆదేశాలను సుప్రీంకోర్టు తోచిపుచ్చింది. ఎఫ్ఐఆర్ నమోదుకు ప్రాథమిక విచారణ అవసరమన్న ఆదేశాలనూ సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. మార్చి 20, 2018లో సుప్రీం ఇచ్చిన తీర్పుపై కేంద్రం రివ్యూ పటిషన్ దాఖలు చేయగా, ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది. అరుణ్ మిశ్రా, ఎం ఆర్ షా మరియు బి ఆర్ గవాయ్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ తెలిపిన వివరాల మేరకు ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీలకు చెందిన ప్రజలు నేటికి సమానత్వం కోసం పోరాడుతున్నారని వారు తెలిపారు.ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ఆర్టికల్ 15 ఆధారంగా వారికి ప్రత్యేక రక్షణ కల్పించిందనీ, అయినప్పటికీ వారు సమాజంలో సామాజిక బహిష్కరణకు గురవుతున్నారని ధర్మాసనం తెలిపింది. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తే అది కులాల తప్పు కాదనీ, మానవ తప్పిదం మాత్రమేనని ఈ సందర్భంగా కోర్టు తెలిపింది.

## మేడారం జాతరకొచ్చే భక్తులకు..

# ఎలాంటి లోటురానివ్వద్దు

- కోటి మంది భక్తులు వస్తారని అంచనా
- డిసెంబర్ చివరినాటికి పనులు పూర్తి చేయాలి
- క్యూలైన్ల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేయండి
- మేడారం జాతరపై సమీక్షలో సీఎస్ ఎస్.కె.జోషి

హైదరాబాద్, అక్టోబర్1(ఆర్ఎన్ఎ) : ఫిబ్రవరి 5 నుండి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్. కె.జోషి ఆదేశించారు. మంగళవారం బి.ఆర్.కె.ఆర్ భవన్ లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో మేడారం జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. మేడారం జాతరకు కోటికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, ప్రతిశాఖ తమకు కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. వచ్చే 10 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి సౌకర్యాలను మెరుగు పరచాలన్నారు. జాతంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణహితంగా అడవులకు ఎటువంటి నష్టం కలగకుండా చూడాలన్నారు. జాతర ఏర్పాట్ల కోసం భూసేకరణకు సంబంధించి భూములు ఇచ్చేవారికి స్వయం ఉపాధి కల్పించి ఎంటర్ ప్రిన్యూర్ షిప్ అభివృద్ధి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

గత సంవత్సరపు జాతర నిర్వహణలో ఏర్పడిన లోటుపాట్లను దృష్టిలో ఉంచుకొని పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం, పార్కింగ్, బందోబస్తు, బస్సు సర్వీసుల ఏర్పాటు, మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నిర్వహణ, అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. వివిధ శాఖలు తమకు కేటాయించిన పనులను డిసెంబర్ చివరినాటికి పూర్తి చేయాలన్నారు. క్యూలైన్ల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. గత జాతరలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనుల పరికరాలను తిరిగి వాడుకునేలా చూడాలన్నారు. పోలీసు శాఖ ద్వారా సిసి టివి ల ఏర్పాటు తో పాటు బందోబస్త్, ట్రాఫిక్ నిర్వహణను వివిధ శాఖలు సమన్వయంతో చేపట్టాలన్నారు. సమాచార శాఖ ద్వారా మీడియా సెంటర్ ఏరాటు చేసి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కలెక్టర్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పూర్తి చేయాలని, వివిధ శాఖల ప్రతిపాదనలపై గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్ర శేఖర్ రావు గారి ఆమోదం పొందాక జి.వో జారీచేస్తావన్నారు. ములుగు కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జాతర కోసం శాశ్వత ప్రతిపాదికన ఏర్పాట్లు చేయడానికి భూసేకరణ చేయాల్సి ఉందని వివరించారు.

మహిళలు, వృద్ధుల కోసం వసతి కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. పరిశుభ్రత కోసం జిహెచ్ఎంసి సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సమీక్షలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ అధికారి శివశంకర్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీమతి క్రిస్టినా జడ్ చొంగ్తూ, దేవాదాయశాఖ కమిషనర్ అనీల్ కుమార్, ఫైర్ సర్వీసెస్ డిజి సంజయ్ కుమార్ జైన్, ములుగు కలెక్టర్ నారాయణ రెడ్డి, పీసీసీఎఫ్ శోభ, సమాచార శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లే లతో పాటు ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య, ఖీచా,ఖిఅ, పోలీస్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాశ్మీర్‌లో భారీగా ఆర్డీఎక్స్ స్వాధీనం

శ్రీనగర్,అక్టోబర్1 (ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు భారీ స్థాయిలో ఆర్డీఎక్స్ పేలుడు పదార్ధాన్ని స్వాధీనం చేసుకున్నాయి. జమ్మూలోని ఓ బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సు నుంచి సుమారు 15 కిలోల ఆర్డీఎక్స్‌ను సీజ్ చేశారు. కథువా జిల్లాలోని బిలావర్ నుంచి జమ్మూకు ఆ బస్సు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. ఇటీవలే బిలావర్‌లోని ఓ ప్రాంతం నుంచి పోలీసులు సుమారు 40 కేజీల గన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

## ఎంజీఎం తరహాలో...

# హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రి

## - వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేంద్ర

కరీంనగర్, అక్టోబర్1(ఆంఎన్ఎ) : వరంగల్ ఎంజిఎం తరహాలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చి దిద్దుతామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ఈటల మాట్లాడారు. రాష్ట్రంలో వైద్య రంగం బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ జ్వరాలు వస్తున్నాయని అన్నారు. జ్వరం వచ్చిందంటే అది డెంగ్యూ, మలేరియాగా భావించి ఆందోళన చెందవద్దని, ప్రతీ జ్వరమూ డెంగ్యూ కాదన్నారు. గ్రామాలు పరిశుభ్రంగాఉంటే వైద్య ఆరోగ్య శాఖతో అవసరం ఉండదన్నారు. 30రోజుల ప్రణాళికతో గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపొందించాలన్నారు. ఎన్నికల్లో గెలిచేంత వరకే పార్టీలు, జెండాలు, గెలిచిన తరువాత ప్రజలందరినీ సమానంగా చూడాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్ ల సేవ గొప్పదని, అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సీఎం కేసీఆర్ 30రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఈ 30రోజుల్లో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడిందన్నారు. గ్రామస్తులందరూ అన్ని గ్రామాల్లో స్వచ్ఛందంగా ముందుకొచ్చి గ్రామాలను శుభ్రం చేసుకున్నారని అన్నారు. గ్రామాలను అభివృద్ధిపథంలో నడిపించేందుకు కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అన్న గాంధీజీ మాటలను సీఎం కేసీఆర్ స్ఫూర్తిగా తీసుకొని పల్లెల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

# బ్యాంకులకు ఒకే రకమైన సమయపాలన

హైదరాబాద్,అక్టోబర్1 (ఆర్ఎన్ఎ): బ్యాంకుల పనివేళలు మారాయి. రాష్ట్రంలోని ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ ఇకపై ఒకే రకమైన సమయ పాలనను పాటించనున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పని చేయనున్నాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి 2.30 గంటల వరకు బ్యాంకు ఉద్యోగులకు భోజన విరామం ఉంటుందని.. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి ఆదివారం, రెండు, నాలుగు శనివారాల్లో బ్యాంకులకు యధావిధిగా సెలవులు ఉంటాయి. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బ్యాంకులకు సెలవు ఉంటుంది.

## అంతర్జాతీయ దౌత్యంపై..

# మోడీకి ట్రైనింగ్ ఇవ్వండి!


## - విదేశాంగమంత్రికి ట్విటర్‌లో రాహుల్ సూచన

న్యూఢిల్లీ, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ) : అతర్జాతీయ దౌత్యం ఎలా చేయాలో ప్రధాని మోడీకి కొంచెం నేర్పాలని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌ను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కోరారు. ఇటీవల అమెరికాలోని హ్యూస్టన్ లో జరిగిన హౌడీ మోడీ కార్యక్రమానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీతో కలిసి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమ సమయంలో అబ్ కీ బార్ ట్రంప్ సర్కర్(మరోసారి ట్రంప్ సర్కార్)అని మోడీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే.

విదేశీ రాజకీయాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారంటూ మోడీ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో ఈ విషయంపై మంగళవారం విదేశాంగ శాఖమంత్రి జై శంకర్ స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న జైశంకర్ ఓ మీడియా సమావేశంలో పాల్గొన్నప్పుడు మోడీ వ్యాఖ్యలు గురించి భారతీయ జర్నలిస్టులు అడగగా.. మరోసారి ట్రంప్ సర్కారే అధికారంలోకి రావాలని మోడీ చెప్పలేదని,మోడీ వ్యాఖ్యలు తప్పుగా వక్రీకరించారని ఆయన అన్నారు. మోడీ ప్రసంగాన్ని చాలా జాగ్రత్తగా వినాలని ఆయన సూచించారు. మరోసారి అమెరికా అధ్యక్ష బరిలో నిలుస్తున్న ట్రంపే అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అనే పదాన్ని వాడారని, దాని గురించే మోడీ ఆ సభలో మాట్లాడారని తెలిపారు.

ప్రధాని మోడీ అతను ఏమి మాట్లాడుతున్నాడో చాలా స్పష్టంగా చెప్పాడని అన్నారు. ట్రంప్ ను ఉద్దేశించి ఓ అభ్యర్థిగా మీరు ఆబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అని చెప్పారని మోడీ ఆ సభలో గుర్తుచేశాడని, భారత్, భారతీయ అమెరికన్లకు కనెక్ట్ అయ్యేందుకు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను మోడీ ప్రస్తావించాడని జైశంకర్ తెలిపారు. విదేశీ రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోబోమని తెలిపారు. అమెరికాలో ఏమి జరిగినా అది వారి రాజకీయాలు అని భారత రాజకీయాలు కాదని జైశంకర్ అన్నారు అయితే మోడీ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని జైశంకర్ అనడాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ తీవ్రంగా ఆక్షేపించారు. ప్రధాని మోడీ అసమర్థత్వాన్ని కప్పిపుచ్చుతన్న విదేశాంగ శాకమంత్రికి థ్యాంక్స్ అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. అంతర్జాతీయ దౌత్యం ఎలా చేయాలో జైశంకర్ మోడీకి కొంచెం నేర్పాలంటూ ట్వీట్ లో తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ మన పొరుగు వాడు - తేసి లో
మనపై కాల్దువ్వ - ధగ - సమాధానయిడున
చటుడుగు లాల్బహదూరుకు
ప్రగతుల నందించు చుంటి భక్తి ప్రపత్తిన్!!

( అక్టోబర్ 2 లాల్ బహదూరు శాస్త్రి జననం)



-రాధశ్రీ

సెల్: 9494481210

# సమాజం ఒక ప్రశ్నలా మారింది....?

నేటి నిజం
బుధవారం 2-10-2019

గాంధీ అనే పేరు తెలియనివారులేరు. మన దేశ స్వాతంత్ర్యానికి పాటుపడిన మహాత్ములు ఎందరో వున్నా తొలి అడుగు గాంధీదే కావడం యావద్భారతదేశానికి మార్గదర్శకంగా నిలిచింది. అలాంటి మహాత్ముడు జన్మించిన నేల ఇది.. ఆయన పాదం మోపి తిరిగిన ఈ నేలపై మనం సంచరిస్తున్నందుకు గర్వపడాలి. వీరి నడవడికే మానవత్వాన్ని అవలోకించడం అనేది ఆయన తత్వం. వారి అవలోకనలోని కిరణాలే నేడు మనం నిత్యం తలుచుకునే శాంతి, అహింసలు. సత్యాన్ని, అహింసను వారు రెండు నేత్రాలుగా భావించడం మూలంగానే ఆయన అనుకున్నదల్లా సాధించారు. ఎన్నో ఆటంకాలకు, ఎన్నెన్నో అవరోధాలు ఎదురైనా తలవంచలేదు. కరుణ, సేవ, ప్రేమ, నిరాడంబరత్వం లాంటి పథకాలన్నింటిలో గాంధీజీ పరిమళించే పూలు పూయించారు. రోగిష్టివారైనా, కడుపేద వారైనా ఎవరైనా తాను అత్యంత ప్రేమతో ఆదరించి వారికి కావాల్సిన సహాయం కానీ, సేవగానీ ఎంతో ఆత్మీయంగా అందించేవారు. అంతటి మహోన్నతమైన వ్యక్తిత్వం ఎవరికి వుంది? ఇకపై వుంటుంది? ఇంతటి అద్వితీయమైన తాత్వికుడు ఎక్కడ దొరుకుతాడు.? వీరిలో అభ్యుదయ తాత్వికుడు ఉన్నాడు.. విశ్వప్రేమ మనిషిని ఎంత పైకి తీసుకుని వెళ్లగలదో అనేది మహాత్ముడు తన అనుభవ పూర్వకంగా చూడగలిగాడు. కానీ అలాగని బయటి దృశ్యాలను చూసి స్పందించడమేకాకుండా తనలో తానే చేసుకునే దృశ్యాలు కొన్ని ఉంటాయి వాటినుండి మార్పుచెందటమే అసలైన పరిణామనుకొన్నాడు. తనకు తానే ఒక గురువయ్యాడు. తననుండి ఎన్నోతానే నేర్చుకుని ప్రజలను ఎంతో శక్తివంతులుగా తీర్చిదిద్దాడు. ఒక మనిషి ఒక ప్రత్యేకమైన స్థానం చేరుకో వడానికి ఎంతగా శ్రమించాలి? మానసిక, నైతిక, ఆధ్యాత్మిక కోణాల్లోనే కాకుండా మరే ఇతర మార్గాల్లోనూ ఒక ప్రాణిని బాధించినా అది హింసకిందే అవుతుందని జీవహింస మహాపాపమని అనుకునేవారు. అహింస మాత్రం ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా నిలుస్తుందని గట్టిగా నమ్మేవారు. చెడును నిర్మూలించడానికి ప్రతీకారం కంటే మంచే ఎక్కువగా ఉపయోగిస్తుందని చాటి చెప్పిన మహనీయుడు మోహన్‌దాస్ కరంచెంద్ గాంధీ..అలాంటి మహనీయుని జాడలలో నడుస్తున్న మనం నిత్యం కక్షలు, కార్పణ్యాలు, హింసలు, ప్రతీకారాలు, ఆవేశాలు, అసూయ, స్వార్థం, పరనిందలు లాంటి గుణాలతో తాను తనకు తాను అలజడికి గురి అయి, వేరొకరిని అలజడికి గురిచేసి వికృతంగా జీవిస్తున్నాడు. బతుకు మూన్నాళ్ల ముచ్చట.. అంతమాత్రానికి పదవులకోసం తెగనరుకుకోవడం, అంతస్తులకోసం చంపుకోవడం, ఆస్తులకోసం తన్నుకోవడం చూస్తుంటే ప్రజలు ఏమయిపోతున్నారో.. అసలు ఏమయిపోతారో అనేదే ఒక ప్రశ్నలా మారింది. నిత్యం ఏదో కావాలనుకునే తత్వం మనుషుల్ని ఎం చేస్తోందో, ఎవరికి ఎవరిని ఎందుకు దూరం చేస్తోందో అర్థం కాని తీరులో ఉన్నదిప్పుడు నేటి తరంలో గాంధీ అంటే ఎవరికి తెలుస్తోంది? ఎవరో ఒక తాత అనుకుంటున్నారే తప్ప ఈ గాంధీ తత్వాలు, ఆశయాలు, గూర్చి పాఠ్యాంశాలలో ఉన్నా అవన్నీ నిదానంగా పిల్లలకు తెలియజేసేటంత గొప్పవారు ఎవరున్నారు? కేవలం ఆరోజు రావడంతోటి వాటి గురించి నామమాత్రంగా తెలుపుకోవడం తప్ప ఒక్కొక్కరికి అర్థం అయ్యే రీతిలో ఎవరు తెలియజేస్తున్నారు? ఇవన్నీ ప్రశ్నలే...!! దాంతోపాటు నిజంగా ఇది గాంధీ పుట్టిన దేశమేనా? అనేది కూడా ఒక ప్రశ్నే...!!

# తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి గాంధీ

**అహింసా విధానమే ఉద్యమ పంథా**

**అందుకే విజయం సాధించి చరిత్రకెక్కింది**

హైదరాబాద్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): నేటి ఆధునిక సమాజంలో గాంధీ ఉద్యమపంథాను ఎంచుకున్న కారణంగానే ప్రత్యేక తెలంగాణ సాధ్యం అయ్యింది. ఉద్యమం సాంతం గాంధేయ మార్గంలోనే నడిచింది. గాంధీ అహింసామార్గం గురించి తెలియని వారు సైతం ఈ పంథాలో సాగారు. ఉద్యమంలో పాల్గొన్న కెసిఆర్ కావచ్చు, ప్రొఫెసర్ కోదండరామ్ కావచ్చు..యావత్ తెలంగాణ ప్రజలు గాంధీ అనుసరించిన అహింసామార్గంలోనే ముందుకు సాగారు. అందుకే ఎక్కడా హింసకు తావులేకుండా ఉద్యమం సాగి విజయం సాధించింది. ఇది ప్రపంచానికి మరోమారు గాంధీ గొప్పతనానికి నిదర్శనంగా నిలిచింది. ఈ విషయాన్ని జేఏసీ పదేపదే ప్రకటించింది. గాంధీ పేరు ఎత్తుకున్న తర్వాత ప్రభుత్వాలు ఏమీ చేయలేక పోయాయి. పైగా ప్రజలు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా రోడ్లపైకి వచ్చి ఉద్యమించారు. ఇది మన కళ్ల ముందు జరిగిన చరిత్ర. ఈ ఉద్యమం విజయం సాధించింది. 1952 కానీ, 1969 ఉద్యమాల్లో గాంధీ సిద్ధాంత ప్రస్తావన లేదు. అందు వల్ల నాటి ప్రభుత్వాలు వాటిని అణిచివేయగలిగాయి. ఈ సారి ఉద్యమంలో గాంధీ ముందు వరుసలో ఉన్నారు. గాంధీ సిద్ధాంత ఆధార ఉద్యమమని ఆచరణ ద్వారా ఉద్యమ నాయకత్వం చూపించింది. అందు వల్ల తెలంగాణకు పోరాటాలే తప్ప విజయాలు లేవు అనే వేదనను తొలగించిందీ గాంధీ మార్గమే. సామాజిక కార్యకర్త అన్నా హజారే కూడా గాంధీ చూపిన అహింసామార్గంలోనే ముందుకు సాగి దేశంలో కదలిక తీసుకుని వచ్చారు. గాంధీ తర్వాత అవినీతి గురించి, రాజకీయాల్లో మార్పు వంటి అంశాలు జాతీయ అజెండా అయ్యాయి. రాలేగాం సిద్ధిలో ఉండే హజారే యావత్ దేశాన్ని కదలించాడు. ముఖ్యంగా ఈ తరం అంతా జాతీయ జెండాలతో ఆయన వెనుకే నిలబడింది. లాఠీ దెబ్బలు లేకుండా, హింసాపద్ధతలకు తావీయకుండా ఆయన జాతీయ జెండా చేత పట్టారు. గాంధీ టోపీ పెట్టారు. 'గాంధీనే నా మార్గం' అన్నారు. యావత్ దేశాన్ని తన వెంట నడిపించుకున్నారు. ఈ తరం నెత్తుల మీద గాంధీ టోపీలు పెట్టుకోవడానికి నాటి గాంధీ ఆలోచన, ఆచరణ తప్ప మరోటి కాదు. అంటే ఉద్యమాలు చేసే వారికి తరతమ బేధాలు లేకుండా ఉద్యమంలోకి వచ్చే స్ఫూర్తికి గాంధీనే పునాది అని గుర్తించాలి. కేజ్రీవాల్ వంటి వారు రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. ఈయనకూ స్ఫూర్తి గాంధీనే. ఆయన చేసిన ఆందోళనలు, ధర్నాలన్నీ గాంధేయ మార్గంలోనే సాగాయి. ఎక్కడ హర్తాళ్ చేసినా గాంధీనే స్ఫూర్తిగా తీసుకున్నారు. కేజ్రీవాల్ వెంట ఢిల్లీ నడిచింది. కానీ వారిని నడిపించింది గాంధీనే. అందుకే కేజ్రీవాల్ అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అన్నా హజారేతో కలసి ఉద్యమించి విజయం సాధించారు. హింసను, ప్రతీకారేచ్ఛను ఆదర్శంగా చూపించే సినిమాలను ఆరాధించే జనం దృష్టిలో అహింస పెద్ద ఆదర్శం కాదు. కానీ అహింసా పద్ధతుత్తో పోరాటం నిజజీవితంలో మాత్రం హీరోజయిజంగానే నిలబడుతుందని తెలంగాణ ఉద్యమం నిరూపించింది.

# గాంధీమార్గాన్ని విస్మరించిన నేతలు

హైదరాబాద్, అక్టోబర్ 1:రక్త మమాంసాలతో ఇలాంటి ఓ వ్యక్తి భూమ్మీద జీవించాడంటే నమ్మలేకపోతున్నామంటూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ గాంధీ గురించి చేసిన వ్యాఖ్యలు మహాత్ముడి గొప్పతనానికి నిదర్శనాలు. తాను చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరించి చూపిన మహనీయుడు బాపు. 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇప్పటికీ బాపూ ఆదర్శాలు ఆచరణీయంగానే ఉన్నాయి. నేటి రాజకీయ నాయకులు బాపూను తలచి దండలు వేయడం తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు. ఈ దేశం ఎంతో ప్రగతి సాధించడానికి అవకాశం ఉన్నా స్వార్థ రాజకీయాల కారణంగా ముందుకు సాగలేకపోయాం. స్వాంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా ఇంకా దరిద్ర నారాయణులగానే అనేకులు మిగిలారు. రాజకీయం అంటే అధికారం అనుభవించడం తప్ప తప్ప దేశాన్ని గురించి ఆలోచన చేయని నేతలు ఇవాళ రాజ్యమేలుతున్నారు. అప్పనంగా సంపాదించడం, అధికారం వెలగబెట్టడం అలవాటుగా చేసుకున్నారు. తాను నమ్మిన అహింసా సిద్ధదాంతం కావచ్చు లేదా... ఉద్యమపంథా కావచ్చు...ఆచరించి బ్రిటిషు వారికి వ్యతిరేకంగా గాంధీ పోరాటం చేశారు. బ్రిటిషు వారిచేతనే భేష్ అన్పించుకున్నారు. గాంధీ ప్రత్యేకత అంటే అదే. ఆయన తను చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరించారు గనుకనే అశేషమైన ప్రజల మద్దతు సాధించగలిగారు. దేశ ప్రజల ఆలోచన స్థితిని, వారి చైతన్యాన్ని గుర్తించి వారిని ఉద్యమంలోకి రప్పించాలో గ్రహించిన గాంధీ స్వాతంత్ర్యాన్ని సాధించగలిగారు. అందుకే ఆయన నాటి భారత సమాజాన్ని కదలించేందుకు చాలా చిన్నచిన్న విషయాలనే ఎంచుకున్నారు. అంతేకాదు ప్రజల నిత్య జీవితంపై ప్రభావం చూపించే ఉప్పును ఉద్యమానికి ఆయుధం చేసుకున్న ధీశాలి. నిత్యావసరాలను, అత్యంత ప్రభావం చూపే అంశాలే ఆయన ఉద్యమ ఇతి వృత్తాలు. అందుకే దండి ఉప్పు సత్యాగ్రహం యావత్ దేశాన్ని కదలించింది. ఉప్పు తయారీ వొద్దన్నారు. ఉప్పు ఉంటే చాలు, కూరలు లేకున్నా పూట గడుస్తుంది. దీన్ని పట్టుకున్నారు గాంధీ. అందుకే అంతకు ముందు ఎంతో మంది స్వతంత్ర ఉద్యమాన్ని నడిపినా గాంధీకి ముందు గాంధీ తర్వాత అనే విభజన రేఖ వచ్చింది. అంతలా ఉద్యమాలను, ప్రజలను, పాలకులను ప్రభావితం చేశారు గాంధీ. ఒక్క మాటలో చెప్పాలంటే తెల్లవారిని తరిమి కొట్టేందుకు ఎలాంటి ఆయుధాలు అక్కర్లేకుండా ముందుకు సాగిన ఉక్కు సంకల్పం గాంధీ సొంతం. నాడు బ్రిటిషు ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి ఆయన అహింసను ఆయుధంగా చేసుకున్నాడు కనుకనే బలవంతులైన వారిని ఎదిరించగలిగారు. ప్రజలు కూడా ఎక్కడిక్కడా అహింసతో అడ్డుకున్నారు. గోచీ పెట్టుకున్న ఈ పెద్దాయనతో తమకు పేచీ లేదని బ్రిటిషు పాలకులు భావించేలా చేశారు గాంధీ. కానీ ఆయనే తన శాంతియుత పద్దతులతో బ్రిటిషర్లను గడగడలాడించాడు. ఆచరణనీయమైన ఉద్యమ మార్గాల ద్వారా ఆయనను ముట్టుకోవాలంటే కూడా నాటి పాలకులు భయపడ్డారు. ఆయన హింస చేయడం లేదు?. అందరి లాగే స్వాతంత్ర్యం కోరుతున్నారు. కానీ నాటి అందరి నాయకులంటే తిరుగులేని నేత అయ్యారు. ఇంకా చెప్పాలంటే స్వతంత్ర ఉద్యమం 1920ల తర్వాతనే ప్రారంభం అయింది. చాలా ప్రభావవంతంగా గాంధీజీ దూసుకొచ్చారు. ఏ యేఅంశాలను తీసుకుంటే ప్రజలు కదులుతారు. ప్రజలను ఎట్లా ఉద్యమంలోకి రప్పించాలి. ఎట్లా ప్రజలను తమ సమస్యల పట్ల ముందుకు తీసుకుని వెళ్లాలన్న విషయాలను సూటిగా, భక్తి మార్గంలో, నైతిక మార్గంలో బోధించారు. ఆవే ఆయనను మహాత్ముడిగా నిలబెట్టాయి. చెప్పిన వాటిని ఆచరించడం వల్లనే ప్రపంచ చరిత్రలో ఆయన చిరస్మరణీయమైన వ్యక్తిగా నిలబడ్డాడు. గాంధీజీ చెప్పిన చాలా విషయాలు నేటి ఉద్యమాలకు, ప్రభుత్వాలకు,దేశాలకు ఎజెండాలవుతున్నాయి. ప్రపంచానికి మహాత్మా గాంధీ శాంతి మార్గాన్ని చూపడమేకాకుండా గొప్ప ఆధ్యాత్మిక సంపదను వారసత్వంగా అందించారు. గాంధీజీ 150వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈసారి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గాంధీజీ తన బోధనలు, నడవడి ద్వారా ప్రపంచానికి గొప్ప ఆధ్యాత్మిక వారసత్వ సంపదను అందించారు. గాంధీజీ భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని అహింసామార్గంలో నడిపించిన తీరుతోనే ఐన్‌స్టీన్ అచ్చెరువొంది రక్త మాంసాలతో ఇలాంటి ఓ వ్యక్తి భూమ్మీద జీవించాడంటే నమ్మలేమన్నారు. దక్షిణాఫ్రికా నుంచి వెనక్కు వచ్చిన గాంధీ, ఆ వెంటనే భారతజాతీయోద్యమంలో ప్రవేశించారు. తాను అభిమానించే గోఖలే స్థానాన్ని భర్తీ చేయాలనుకున్నారు. తిలక్, చంపారన్, రౌలట్ చట్టం, సహాయనిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమం ఈ వరుస సందర్భాలతో తనను తాను నిలబెట్టుకున్నాడు. అహింసను ఊతకర్రగా చేసుకుని విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, అస్పృశ్యతా నివారణ వంటి కార్యక్రమాలను ప్రతిపాదించి, దేశవ్యాప్తంగా జాతీయోద్యమానికి విస్తృతమైన పునాదిని నిర్మించారు. జాతీయోద్యమాన్ని ఏకోన్ముఖంగా తీసుకుని పోవడానికి ఆయన అనుస రించిన అనేక పద్ధతుల్లో తన ఆహార్యం కూడా ఒకటి. కొల్లాయి కట్టిన గాంధీని చూస్తే ఇవాళ నిర్లిప్తంగా అనిపించవచ్చును కానీ, అది ఆయన తన రాజకీయ లక్ష్యసాధనకు ఎంచుకుని ధరించిన ఆహార్యం. ఆయన తనను తాను ప్రజల ముందు నిలబెట్టుకోవడానికి తనకంటూ ప్రత్యేకతను సాధించారు. బలహీనుడిలాగా, బాధితుడిలాగా, ఒక గ్రామీణ భారతీయుడి రూపురేఖలకు దగ్గరగా ఉండాలనుకున్నాడు. ఇలా చెప్పిన సిద్దాంతాలను ఆచరిస్తూ అందరినీ కలుపుకుని ముందుకు తీసుకుని పోవడం ద్వారా బలమైన బ్రిటిషర్ల నుంచి దేశ దాస్య శృంఖలాలను తెంచగలిగారు.

# గాంధీ ఆశయాలకు అనుగుణంగానే పల్లెప్రగతి

**మహాత్ముడి బోధనలే కెసిఆర్‌కు స్ఫూర్తి**

**30రోజుల పల్లె ప్రణాళికకు అదే నాంది**

**మంత్రి ఎర్రబెల్లి దయకార్ రావు వెల్లడి**

వరంగల్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): గ్రామాల అభివృద్ధికి సిఎం కెసిఆర్ ప్రతిపాదించిన గ్రామప్రణాళిక నమూనా అంతా గాంధీ స్ఫూర్తితోనే తీసుకున్నదని రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గాంధీ స్ఫూర్తితోనే ఇవాళ తెలంగాణ అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. పల్లెలను అభివృద్ధి నమూనాలుచేయాలన్న సిఎం కెసిఆర్ సంకల్పం వెనక బలమైన కారణం ఉందన్నారు. మహాత్ముడిని ఆదర్శంగా తీసుకుని ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని గ్రహించి దిశానిర్దేశం చేశారని అన్నారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక వెనక గ్రామాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అందుకే సిఎం కెసిఆర్ 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం చేపట్టారని అన్నారు. పల్లె పచ్చని చెట్లతో,స్వచ్ఛంగా కళకళలాడాలంటే అందరి సహకారం అవసరమన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల న్నారు. గ్రామంలో తుప్పుపట్టిన, వంగిన స్తంభాలను తొలగించి కొత్తవాటిని అమర్చుతున్నట్లు తెలిపారు. జనాభా నిష్పత్తి ప్రకారం 500 జనాభా కలిగి ఉన్న ప్రతీ గ్రామానికి రూ.8లక్షల చొప్పున నిధులు మంజూరు చేయుటకు ప్రభుత్వం రూ.350 కోట్లు విడుదల చేయనున్నదని తెలిపారు. సాగునీటికి కొరత రాకుండా చెక్‌డ్యాం నిర్మాణాలు చేపడుతామని అన్నారు. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి నిధులు ఉపయోగించి గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని అన్నారు.

రాష్ట్రంలోని ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ తోబుట్టువు లాంటివారని, అందుకే ప్రతీ బతుకమ్మ పండుగకు చీరలు అందిస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్‌కు మహిళలపై ప్రత్యేక గౌరవం ఉందని, పోరాడి సాధించుకున్న తెలంగాణలో వారు సంతోషంగా ఉండాలని నాలుగేళ్లుగా బతుకమ్మ పండుగకు చీరలు అందజేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర సర్కార్‌కు ఆడపడుచుల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. రాష్ట్రంలోని మహిళందరూ సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆత్మభిమానంతో జీవించాలన్నదే సర్కార్ ధ్యేయమన్నారు. 70 ఏళ్ల పాలనలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధిని కేవలం ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసి చూపించారన్నారు. రైతుల కోసం ప్రభుత్వం 24 గంటల కరంట్‌ను ఉచితంగా అందిస్తుందన్నారు. పేదింటి ఆడపడుచుల కోసం కల్యాణలక్ష్మి, సాదీముబార్ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రైతులకు పంట పెట్టుబడి కోసం ఏడాదిలో రెండు పంటలకు ఎకరానికి రూ. 10 వేల చొప్పున అందిస్తున్న ఘనత ఒక్క టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామంలో శ్రమదానం చేయని వారికి సంక్షేమ పథకాలు అందవన్నారు. ప్రతీ గ్రామానికి ఏటా రూ. 80 లక్షలు అందిస్తున్నామన్నారు. పరిశుభ్రత పాటించకుంటే జరిమానాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఊరుకోసం శ్రమదానం చేసే మహిళా సంఘాలకు రూ. 50 వేల నుంచి 3 లక్షల వరకు రుణం ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ప్రతీ గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పా టు చేసుకోవాలన్నారు. ఇవన్నీ కూడా గాంధీ ఆనాడే చెప్పారని, ఇప్పుడు తూచతప్పకుండా పాటిస్తూ గ్రామాలను అభివృద్ధిలో ముందుకు తీసుకుని వెళుతున్న ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు.

# గాంధీ రాకతోనే జాతీయోద్యమానికి రూపు

**అహింసా వాదాన్ని ఊతకర్రగా చేసుకుని పోరాటం**

**హింసా వాదాన్ని ఏనాడూ ప్రోత్సహించని గాంధీ**

న్యూఢిల్లీ,అక్టోబర్1 (ఆర్ఎన్ఎ): బ్రిటిషర్ల దాష్టీకాన్ని ఎండగడుతూ వారికి వ్యతిరేకంగా భారత జాతీయోద్యమం 1857 లో ఉవ్వెత్తున ఎగిసినా దానికి ఓ ఉద్యమ పంథా లేదనే చెప్పాలి. అక్కడక్కడా వచ్చిన నిరసనలు బ్రిటిషర్లపై ఉద్యమించడానికి ఊతమయ్యాయి. అయితే గాంధీ ప్రవేశం తరవాతనే ఉద్యమం ఓ పద్దతిలో ముందుకు సాగిందనే చెప్పాలి. ఆనాటి ప్రథమ స్వాతంత్ర్య పోరాటం లేదా తిరుగుబాటు దీర్ఘకాలం పాటు, బహుముఖంగా సాగింది. ఏ ఒక్కరి నాయకత్వంలో ఆది సాగలేదు.

అనేక వందల తిరుగుబాటుదారులు తమకుతాముగా ముందు నిలబడి బ్రిటిషంను ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. అందుకే ఆనాటి పోరాటం లేదా జాతీయోద్యమం పతాకస్థాయికి చేరలేదు. దక్షిణాఫ్రికా నుంచి వెనక్కు వచ్చిన గాంధీ, ఆ వెంటనే భారతజాతీయోద్యమంలో ప్రవేశించారు. తాను అక్కడ అవమానానికి గురైన తరవాత ఈ తెల్లవారి అహంకారాన్ని అణచివేందుకు భారత జాతీయ ఉద్యమంలో కీలకభూమిక కావాలన్న సంకల్పంతోనే రంగంలోకి దిగారు. తనకంటూ ప్రత్యేకతను రూపొందించుకుని బలవంతుడైన శత్రువును బలహీనమైన వ్యక్తిగా కనిపిస్తూనే ఎదరించే సాహసం చేసాడు. తిలక్, చంపారన్, రౌలట్ చట్టం, సహాయనిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమం? ఈ వరుస సందర్భాలతో తనను తాను నిలబెట్టుకున్నాడు. అహింసను ఉద్యమ పంథాగా సత్యాన్ని తన ఆధ్యాత్మిక విలువగా స్వీకరించాడు. విదేశీ వస్తు బహిష్కరణం, స్వదేశీ వస్తు వినియోగం, అస్పృశ్యతానివారణ? వంటి కార్యక్రమాలను ప్రతిపాదించి, దేశవ్యాప్తంగా జాతీయోద్యమానికి విస్తృతమైన పునాదిని వేశారు. జాతీయోద్యమాన్ని ఒక్కటిగా తీసుకుపోవడానికి ఆయన అనుసరించిన అనేక పద్ధతుల్లో తన ఆహార్యం కూడా ఒకటి. గోచీతో, పైన కండువాతో మొత్తంగా భారతీయాత్మను ఆచరించాడు.

ఒక గ్రామీణ భారతీయుడి రూపురేఖలకు దగ్గరగా ఉండేలా ఆచరించిన ఆహార్యం కూడా బగా పని చేసింది. దక్షిణాఫ్రికాలో రైలుబ ఒడిలో ఆయనకు ఎదురైన చేదు అనుభవం నుంచి, బ్రిటిష్ పాలనలో మనిషిగా, భారతీయుడిగా తనకు హక్కులు లేవని గుర్తించాడు. అంతే కాదు, భారతీయుడు కావడం వల్లనే తనకు మానవహక్కులు లేవని తెలుసుకున్నాడు.

ఈ తెలివిడిని భారతదేశంలోని కులవ్యవస్థకు అన్వయించి చూడాలని ఆయన అనుకోలేదు. దర్బన్ నగరంలో ఫీనిక్స్ ఇంట్లో ఉన్నప్పుడు, అతిథి ఉపయోగించిన మరుగుదొడ్డి శుభ్రం చేయనందుకు భార్య కస్తూర్బాను చలిరాత్రిలో తెల్లవార్లూ ఇంటివెలుపల ఉంచి శిక్షించాడు గాంధీ. ఆమె ఆ శిక్షను ఎంతో నిష్ఠగా అనుభవించడం చూసి, ఆయనకు సహనం, అహింసల గొప్పతనం తెలిశాయని అంటాడు. భారతదేశంలో అప్పటికే ఉన్న విప్లవ ధోరణులను మినహాయించడానికే అహింసను ఒక ప్రధాన ప్రాతిపదికగా ఆయన తీసుకున్నారని అనుకోవాలి. అందుకే భగతసింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి వారి చర్యలను అంగీకరించ లేదు.

భగత్‌సింగ్ వంటి యోధుల ఉరిశిక్షల విషయంలో కానీ, దండి సత్యాగ్రహం సందర్భంగా చౌరాచౌరీలో ప్రజాగ్రహం విషయంలో కానీ గాంధీ తన మూల సిద్ధాంతాన్ని వదులుకోలేదు. ఉద్యమంలో హింస చెలరేగితే అనేక ఇతర సందర్భాలలో జనం ఆవేశాలను చల్లార్చిన తరవాతనే ముందుకు కదిలారు.

తాను హిందువునే కానీ భారత సమాజం మత సమాజంగా ఉండకూడదంటారు. సంపన్నులైన వారు సమాజ సంపదకు ధర్మకర్తలుగా వ్యవహరించి, ఇతరులను ఆదుకోవాలంటారు. మొత్తం మీద ఉద్యమానికి నైతికతను జోడించడం ద్వారా, కొత్త రాజకీయ వ్యూహరచన చేశారు గాంధీ.నాటి అతివాద హైందవ శక్తులు, కమ్యూనిస్టులు కూడా ఎవరి కారణాలకు వారు ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి విముఖంగా ఉన్న కాలంలో, గాంధీ క్విట్ ఇండియా నినాదానికి సిద్ధపడ్డారు. దేశవిభజనను చివరిదాకా వ్యతిరేకించినా విభజన సమయంలో చెలరేగిన హింసను అదుపుచేయడానికి శక్తి చాలక ఖిన్నుడయ్యాడు.

# నిలోఫర్ క్లినికల్ ట్రయల్స్‌పై విచారణ

## రంగంలోకి దిగిన ముగ్గురు సభ్యుల కమిటీ

## సూపరింటెండెంట్ విచారించిన బృంద సభ్యులు

హైదరాబాద్, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): తీవ్ర దుమారం రేపిన నిలోఫర్ ఆసుపత్రిలోని క్లినికల్ ట్రయల్స్‌పై సోమవారం విచారణ ప్రారంభమైంది. ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ సోమవారం నిలోఫర్ బోర్డు రూమ్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్‌తోపాటు రవికుమార్‌ను విచారించింది. వీరితోపాటు ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాజారావు, లక్ష్మీకామేశ్వరి, విమల థామస్‌లను కమిటీ విచారిస్తోంది. త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఇందులో హాస్పిటల్‌లో చట్టవిరుద్ధంగా క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయన్నది వాస్తవం కాదని నివేదికలో పేర్కొంది. అలాగే ప్రొఫెసర్లపై వస్తున్న ఆరోపణలు సరికావని తెలిపింది. ఎథికల్ కమిటీ నిబంధనల ప్రకారమే క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయని కూడా స్పష్టంచేసింది. ఇక వైద్యులతో భేటీ తర్వాత డీఎంఈని కలిసిన త్రిసభ్య కమిటీ తమ పరిశీలనలో వెల్లడైన విషయాలపై డీఎంఈకి నివేదికను ఇవ్వనుంది. బాధితులుగా వందలాది మంది పిల్లలు నిలోఫర్‌లో వందలాది మంది పిల్లలు ఔషధ కంపెనీల క్లినికల్ ట్రయల్స్ బాధితులుగా మిగిలారు. గతేడాది మే నుంచి ఏడాది పాటు 300 మంది పిల్లలపై క్లినికల్ ట్రయల్స్ జరిగాయి. ఇన్‌పేషెంట్లుగా వచ్చిన నవజాత శిశువులు మొదలు 14 ఏళ్లలోపు పిల్లలపైనే ఈ ప్రయోగాలు జరిగినట్లు క్లినికల్ ట్రయల్స్ రిజిస్ట్రీ ఇండియా నివేదికలో వెల్లడించింది. 300 మందిలో 100 మంది ని జనరల్ వార్డు నుంచి, మరో 100 మందిని పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) నుంచి, ఇంకో 100 మందిని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ) నుంచి ఎంపిక చేశారు. వీరిపై యాంటీ బయోటిక్స్ మందుల ప్రయోగం జరిగిందని నివేదిక తెలిపింది. పిల్లలు రోగాలతో ఆసుపత్రిలో ఉన్నప్పుడు వారిపై యాంటీ బయోటిక్స్ ప్రయోగించారు. తద్వారా వారిపై అదెలా పనిచేసిందో వివరాలు సేకరించారు. ఔషధ సామర్థ్యాన్ని నిర్ధారణ చేశారు. ఈ కాలంలో ఇతర మందులతో పోలుస్తూ అధ్యయనాలు జరిగినట్లు తేలింది. ఇద్దరు వైద్యులు ఈ క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొనగా, కంపెనీల ప్రతినిధులు, ఇతరులు వారికి సహాయకులుగా ఉన్నారు. నిలోఫర్‌లో పదేళ్లుగా క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయని నివేదిక తెలిపింది. ఈ పదేళ్లలో 13 ట్రయల్స్ జరిగాయని, ఈ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై సమాచారం లేదు. అది విచారణలోనే వెల్లడి కావాల్సి ఉంది.

# ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలి

**-సంగారెడ్డిలో మంత్రి హరీశ్‌రావు పర్యటన**

సంగారెడ్డి, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. మండల కేంద్రంలో నిర్మించిన 30 పడకల ఆస్పత్రిని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కల్హేర్‌లో రూ. 6 కోట్లతో ఆస్పత్రిని నిర్మించాం. గర్భిణులకు రూపాయి ఖర్చు లేకుండా ప్రసవాలు చేస్తున్నాం. 30 రోజుల ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కల్పిస్తున్న వసతులపై ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కొద్ది రోజుల్లోనే కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుంది. మనకు నీళ్ల బాధ శాశ్వతంగా దూరం అవుతుంది. కాళేశ్వరం ద్వారా సింగూరు నింపి తాగు, సాగునీటి కష్టాలు తీరుస్తాం. నారాయణఖేడ్ - సంగారెడ్డి రోడ్డును 4 వరసలుగా విస్తరిస్తామని తెలిపారు.

# జెట్ స్పీడ్‌లో పరుగులు తీస్తున్న ఉల్లి

### కోయకుండానే కన్నీరు పెట్టిస్తున్న ధరలు
### కిలో వందకు చేరుతుందంటున్న వ్యాపారులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఆర్ఎన్ఎ): వరుస వర్షాలతో ఉల్లిగడ్డలు కోయకుండానే కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. ప్రస్తుతం కిలో 60 రూపాయలుగ ఆఉన్న ఉల్లి ధరలు మరింతగా పెరిగి వందకు చేరుతుందని వ్యాపారులు అంటున్నారు. కొద్ది రోజులుగా వాటి ధరలు అమాంతం పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తు తం మార్కెట్లో కిలో ఉల్లిగడ్డల ధర రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజలు విలవిల్లాడుతున్నారు. అటు కొనుక్కోలేక, ఇటు వాడకుండా ఉండలేక సతమతమవుతున్నారు. హోటళ్లలో ఉల్లిపాయను ఇప్పుడు డిమాండ్ చేస్తేనే ఇస్తున్నారు. దీంతో చేసేదిలేక నిత్య వినియోగంలో ఉల్లిగడ్డలను తగ్గించారు. గతంలో కిలో ధర రూ.15 నుంచి రూ.20 ఉన్న ఉల్లిగడ్డల డిమాండ్ పెరుగుతూ వస్తోంది. ఉల్లి ధర పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. ప్రతియేడాది ఉల్లి ధర అమాంతం పెరుగుతూనే ఉంటుంది. ఆ సమయంలో మార్కెట్ అధికారులు, జిల్లా పౌరసరఫరాల అధికారులు రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తుంటారు. గతంలో రేషన్ షాపుల ద్వారా కూడా తక్కువ ధరకు ఒక్కొక్కరికి 2కిలోల చొప్పున అందించారు. అయితే ఈసారి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖాధికారులు స్పందించి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి సామాన్య, పేద ప్రజలకు తక్కువ ధరకు ఉల్లిగడ్డలు అందించాలని వినియోగదారులు కోరుతున్నారు. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉల్లిగడ్డల సరఫరా తగ్గిపోయి ధరలు మండిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో వీటి ధర మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు. ఉల్లికి ప్రధానమైన మార్కెట్లు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా దిగుబడులు పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతాల నుంచే ఉల్లిగడ్డలు దిగుమతి తగ్గింది. కర్నాటకతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని పూణె, చంద్రపూర్, బెంగుళూరు, లాసల్‌గావ్ వంటి తదితర ప్రధాన ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వ్యాపారులు ఇక్కడ విక్రయాలు జరుపుతుంటారు. నెలరోజుల క్రితం ఉల్లి కిలో ధర రూ.20 ఉండగా ప్రస్తుతం రెండింతలు దాటిపోయింది. రైతుబజార్‌లో, కూరగాయల మార్కెట్‌లో తెల్ల ఉల్లిగడ్డలు రూ.60 నుంచి 80 వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తుండగా, ఎరుపు రంగు ఉల్లిగడ్డలు రూ.50నుంచి రూ.60 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. మహారాష్ట్రలో రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో పంటలు బాగా దెబ్బతిన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. మహారాష్ట్రలోని నాసిక్ ఉల్లికి పెట్టిందిపేరు. అక్కడినుంచి దేశంలోని నలుమూలలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి ఉల్లిగడ్డలు సరఫరా అవుతాయి. మహారాష్ట్రలోని వర్షాలను సాకుగా చూపి కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి రెండు నుంచి మూడింతలు ధరను అధికంగా పలుకుతూ వినియోగదారుల నుంచి అడ్డగోలుగా వసూలు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఉద్యానవన శాఖాధికారులు ఉల్లి సాగు గురించి రైతులకు అవగాహన కల్పించకపోవడం, రాయితీపై విత్తనాలు అందించకపోవడంతోనే రైతులు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. గతంలో అనేక జిల్లాలో ఉల్లి సాగు చేసేవారని, ప్రస్తుతం కచేపట్టడం లేదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. రైతులు వాణిజ్య పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే వినియోగదారులకు మేలు జరగడంతో పాటు రైతులు ఆర్థికంగా లబ్ధిపొందుతారని అధికారులు అంటున్నారు. అయితే రైతులు మాత్రం సంప్రదాయ పంటలతోనే సరిపెడుతున్నారు.

## కశ్మీర్‌పై విషం చిమ్మిన మలేషియా

### భారత్ ఆక్రమించిందని ఐరాసలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (ఆంఎన్ఎ): జమ్మూకశ్మీర్‌పై చైనా తరవాత మలేషియా విషం చిమ్మింది. కాశ్మీర్‌ను భారత్ ఆక్రమించిందని మలేషియా ప్రధాని మహతిర్ మొహమ్మద్ వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌ను ఆక్రమించడానికి భారత్‌కు ఓ కారణమం ఉండడం నిజమే కావచ్చు కానీ అది తప్పుడు చర్య అని మహతిర్ తెలిపారు. యూఎన్ ఆంక్షలు ఉన్నా కశ్మీర్‌ను ఆక్రమించారన్నారు. ఐక్యరాజ్య సమితిని నిర్లక్ష్యం చేస్తే అది మరో పతనానికి దారి తీస్తుందని మహతిర్ హెచ్చరించారు. పాక్‌తో చర్చించి ఈ సమస్యకు భారత్ అంతం పలకాలన్నారు. ఆక్రమణ ద్వారా కాకుండా చర్చ ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మోదీకి సూచించినట్లు చెప్పారు. ఇటీవల రష్యాలో జరిగిన పర్యటన సమయంలో మోదీతో కశ్మీర్ అంశాన్ని చర్చించినట్లు తెలిపారు.

# హుజూర్ నగర్ అభివృద్ధికి ఓ మంచి అవకాశం

### టీఆర్ఎస్ గెలవాలన్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి
### నామినేషన్ వేసిన శానంపూడి సైదిరెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 1 (ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ ఎన్నికలు హుజూర్‌నగర్ అభివృద్ధి కోసమే వచ్చాయన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ప్రజలకు లాభం.. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఉత్తమ్ కుటుంబానికి లాభం అని వ్యాఖ్యానించారు. హుజూర్‌నగర్ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి పదవుల కోసం ఆంధ్ర నాయకుల వద్ద మొకరిల్లి ఈ ప్రాంతాన్ని అధోగతి పాలు జేసిండు.

హుజూర్‌నగర్‌లో ఆయకట్టు చివరి భూములకు నీళ్లు ఇచ్చిన ఘనత టీఆర్ఎస్ పార్టీదే. హుజూర్‌నగర్ రైతాంగం అంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రజా సమస్యలు పట్టవు... కేవలం పదవులు మాత్రమే ఆయనకు, ఆయన కుటుంబానికి కావాలి. ఈ సారి ఉత్తమ్‌కు గుణపాఠం తప్పదు. టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి యువకుడు, స్థానికుడు.. సైదిరెడ్డి గెలుపు ఖాయమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి మాట్లాడుతూ... ప్రచారంకు వెళుతుంటే ఊళ్లకు ఊళ్లు టీఆర్ఎస్ పార్టీకి జైకొడుతున్నాయి. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న హుజూర్‌నగర్ కోసమే ఈ ఎన్నికలు వచ్చాయి. టీఆర్ఎస్ తెలిస్తే హుజూర్‌నగర్ ప్రజలకు లాభం. కాంగ్రెస్ గెలిస్తే ఉత్తమ్ కుటుంబానికి లాభం. ప్రజలంతా ఇదే విషయాన్ని చెబుతున్నారని తెలిపారు.



హుజూర్‌నగర్‌లో నామినేషన్ వేయడానికి వచ్చిన టిఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి. చిత్రంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి కూడా ఉన్నారు.

## బీహార్‌ను ముంచెత్తిన వరదలు

### సహాయక చర్యలతో ప్రజల తరలింపు

పాట్నా, అక్టోబర్ 1 (ఆర్ఎన్ఎ): బీహార్‌లో వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల వల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లలో జనాలను తీసుకువెళ్తున్నారు. పాట్నాలోని కంకర్‌బాగ్‌లో నీటిలో చిక్కుకున్న వారిని జేసీబీలో తరలించారు. వరద బాధిత జిల్లాల అధికారులతో సీఎం నితీశ్ కుమార్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం సుశీల్ మోదీ.. వరద నీటిలో చిక్కుకున్నారు. పాట్నాలోని తన ఇంటి వద్ద భారీగా వరద చేరుకున్నది. అయితే ఎన్డీఆర్ఎఫ్ దళాలు వచ్చి డిప్యూటీ సీఎంను రక్షించాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు ఆహార సామాగ్రిని అందిస్తున్నట్లు ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ కుమాల్ బాల్‌చంద్ తెలిపారు.

# భారీవర్షాలతో యూపి అతలాకుతలం

### జైల్ బరాక్స్ లోకి నీరు...ఖైదీల తరలింపు
### వారణాసిలో రోడ్డెక్కిన చేపలు

లక్నో,అక్టోబర్1 (ఆర్ఎన్ఎ): భారీ వర్షాలు, వరదలతో ఉత్తరప్రదేశ్ అతలాకుతలమవుతోంది. బల్లియా జైలులోని బారక్స్‌లో వరదనీరు చొచ్చుకు రావడంతో జైలు అధికారులు అప్రమత్తమయ్యారు. సుమారు 500 మంది ఖైదీలను అజంగఢ్ జైలుకు తరలించగా, మరి కొందరిని అంబేద్కర్ నగర్ జైలుకు తరలించినట్టు అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్ రామ్ ఆశ్రాయ్ తెలిపారు. గత నాలుగు రోజులుగా యూపీలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలకు సుమారు 73 మంది మృత్యువాత పడ్డారు. అనేక ప్రాంతాల్లో సాధారణ వర్షపాతానికి మించి రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో ముఖ్యంగా రాష్ట్రంలోని తూర్పు ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. కాగా, బల్లియా జిల్లాలోని జైలు బ్యారక్స్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరిందని, 450 మంది ఖైదీలను అజంగఢ్ జైలుకు పంపేందుకు అధికారులు అనుమతి ఇవ్వగా, మరింత మంది ఖైదీలను మవు, అంబేద్కర్ జైలుకు తరలించేందుకు అనుమతులు రావాల్సి ఉన్నాయని జిల్లా మేజిస్ట్రేట్ భవానీ సింగ్ ఖంగ్రౌత్ చెప్పారు. కాగా, బల్లియా జైలు భవంతి శిథిలావస్థకు చేరుకుందని, భారీ వర్షాలొస్తే లోపలంతా మునిగిపోవడం కొత్త కాదని చెబుతున్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా ఏడుకు పైగా రైళ్లను అధికారులు రద్దు చేయగా, ఐదు రైళ్లను దారి మళ్లించినట్టు ఈశాన్య రైల్వే పబ్లిక్ రిలేషన్స్ అధికారి మహేష్ గుప్తా మీడియాకు తెలిపారు. ఇకపోతే భారీ వర్షాల కారణంగా చేపలు రోడ్డెక్కాయి. చెరువుల్లోనూ, నదుల్లోనూ కనిపించే చేపలు ఇప్పుడు అక్కడ రోడ్లమీదే ఈదుతూ కనిపిస్తున్నాయి. వారణాసిలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రోడ్లపైన నీటి ప్రవాహం కొనసాగుతోంది. దానిలో చేపలు తిరుగాడుతున్నాయి. వర్షాల కారణంగా వారణాసి చుట్టుపక్కల ఉన్న చెరువులు, కుంటలు పరిధికి మించి నిండిపోయి పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆయా చెరువుల్లోని చేపలు రోడ్లమీదకు వస్తున్నాయి. ఇలా కొట్టుకు వస్తున్న చేపలను అందరూ వింతగా చూస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్లపైకి నీరు చేరుతున్నదనే ఆరోపణలున్నాయి. కాగా ఉత్తర భారతంలో కురుస్తున్న వర్షాలు వరద బీభత్సాన్ని తలపిస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా ఇప్పటివరకూ 29 మంది మృత్యువాత పడ్డారు. పలు ఇళ్లు నేలమట్టం కాగా, జనం ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

# పివోకెలో ప్రధాని ఇమ్రాన్ పర్యటన

### భూకంప తాకిడి ప్రాంతాల పరిశీలన

లాహోర్, అక్టోబర్ 1ఆంఎన్ఎ): పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోమవారంనాడు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పర్యటించారు. ఇటీవల భూకంప తాకిడికి గురైన మీర్‌పూర్ జిల్లాలో ఆయన తన పర్యటన సాగించారు. అక్కడ జరిగిన ప్రాణనష్టం, కొనసాగుతున్న సహాయ, పునరావాస కార్యక్రమాలను సమీక్షించారు. పీఓకే ప్రధాని ఫరూఖ్ హైదర్‌తో సమావేశమయ్యారు. పాక్ విదేశాంగ మంత్రి మెహమూద్ ఖురేషి, కశ్మీర్, గిల్గిత్ బాల్టిస్థాన్ వ్యవహారాల మంత్రి అలి అమిన్ గాందపూర్, ఎన్డీఎంఏ చైర్మన్ లెఫ్టినెంట్ జనరల్ మొహమ్మద్ అఫ్జల్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. డివిజనల్ హెడ్‌క్వార్టర్స్ ఆసుపత్రిని సైతం ఇమ్రాన్ ఖాన్ సందర్శించి, భూకంపంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పీఓకే, పరిసర ప్రాంతాలను గత వారంలో రెండు భూకంపాలు తాకాయి. ఈ ప్రభావంతో మీర్‌పూర్, జేలాం జిల్లాల్లో 40 మంది మృత్యువాత పడగా, సుమారు 680 మంది గాయపడినట్టు మీర్పూర్ డివిజనల్ కమిషనర్ మొహమ్మద్ తయ్యబ్ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 454 కాంక్రీట్ ఇళ్లు, 1200 కచ్చా ఇళ్లు ధ్వంసమయ్యాయి. వేలాది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సుమారు 140 నర్మాలు భవంతులు, 200 వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భూకంపం సంభవించిన సమయంలో ప్రధాని ఇమ్రాన్ ఖాన్ న్యూయార్క్‌లో జరిగిన 74వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఉన్నారు. భూకంపంలో మృతిచెందిన వారికి రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ఇమ్రాన్ ప్రకటించారు. ఆస్తినష్టంపై ఇప్పటికే ప్రభుత్వ బృందాలు అంచనా వేస్తున్నాయి. పది రోజుల్లో నివేదిక సమర్పించనున్నాయి.

# నగల దుకాణంలో చోరీకి విఫలయత్నం

## దోపిడీ కేసులో ముఠా అరెస్ట్

హైదరాబాద అక్టోబర్ 1(ఆంఎన్ఎ): హైదరాబాద్ నగర శివారులోని దూలపల్లిలోని ఓ నగల దుకాణంలో చోరీకి దొంగలు విఫలయత్నం చేసి.. ఎస్ఐని వ్యాన్‌తో ఢీకొట్టేందుకు యత్నించి పరారైన కేసులో దోపిడీ దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాను మహారాష్ట్రలో పట్టుకున్నట్లు సైబరాబాద్ పోలీసులు తెలిపారు. ఈ ముఠా బంగారు దుకాణాలు, ఏటీఎంలను టార్గెట్ చేసి దోపిడీలకు పాల్పడు తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సోమవారం తేదీన తెల్లవారుజామున పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. డివిజనల్ నైట్ పెట్రోలింగ్ విధుల్లో ఉన్న దుండిగల్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి.. మేడ్చల్, అల్వాల్, పేట్‌బషీరాబాద్ పీఎస్‌ల నుంచి కొంపల్లి మీదుగా బహదూర్‌పల్లి వైపు వెళ్తున్నారు. తెల్లవారుజామున 2.10 గంటల సమయంలో దూలపల్లిలోని గణేశ్ జ్యూయలరీ దుకాణం ముందు నిలిపి ఉంచిన మారుతి ఈకో వ్యాన్ పై పోలీసుల దృష్టిపడింది. ఏదో జరుగుతుందని అప్రమత్తమైన ఎస్ఐ పెట్రోలింగ్ వాహనం దిగి దొంగలను పట్టుకొనేందుకు యత్నించారు. అయితే తమ వైపుగా రావడాన్ని గమనించిన దొంగలు.. ఒక్కసారిగా వ్యాన్‌తో ఉడాయించేందుకు ముందుకు దూసుకెళ్లారు. అడ్డుకోబోయిన ఎస్ఐ శేఖర్‌రెడ్డిని వ్యాన్‌తో ఢీకొట్టాలని చూశారు. ప్రమాదాన్ని గ్రహించిన ఎస్ఐ శేఖర్‌రెడ్డి.. వెంటనే పక్కకు తప్పుకొని తన సిబ్బందితో వారిని వెంబడించాడు. దూలపల్లి నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత దొంగలు ప్రయాణిస్తున్న వ్యాన్ ఫారెస్ట్ అకాడమీ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో దొంగలు.. పోలీసులకు దొరుకకుండా పారిపోయారు. అడవిలో దొంగలు వదిలివెళ్లిన మారుతీ ఈకో వ్యాన్‌ను ఎస్ఐ శేఖర్‌రెడ్డి తనిఖీ చేయగా.. ఇనుపరాడ్, కట్టర్, దుకాణం షట్టర్ తెరిచేందుకు ఉపయోగించే సామగ్రితోపాటు బండ రాళ్లు దొరికాయి. దొంగలు జ్యూయలరీ షాపులో దోపిడి చేసేందుకే వచ్చినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దుండగులు వాడిన వ్యాన్ ఇటీవల అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైనట్టు తేల్చారు. అలాగే ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక ఏటీఎంను బద్దలుకొట్టేందుకు కూడా తీవ్రంగా యత్నించినట్టు సమాచారం. కత్తెరను ఉపయోగించి మారుతీ ఈకో వ్యాన్‌ను స్టార్ట్ చేసినట్టు పోలీసులు భావించారు. జూలపల్లి జ్యూయలరీ షాపులో దోపిడీకి యత్నించిన దొంగలు పారిపోతుండగా.. వీరి వెనుకాలే మరో కారు అదే స్పీడ్‌తో వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. దుండగులు రెండు కార్లలో పరారైనట్టు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. మారుతీ ఈకో వ్యాన్‌లో నలుగురు దుండగులు ముఖాలకు మాస్కులు వేసుకొని ఉన్నట్లు పోలీసులు చెప్తున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఎస్ఐ శేఖర్‌రెడ్డి పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ సాయంతో దొంగలను పట్టుకొనేందుకు పోలీసులు గాలించి మొత్తానికి నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి ప్రదర్శించిన ధైర్యసాహసానికి అధికారులు ప్రశంసించారు.

## కానిస్టేబుల్ ఫలితాల్లో అవకతవకలు

### హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఆర్ఎన్ఎ): ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు అభ్యర్థులు సోమవారం హైకోర్టు ముందు ఆందోళనకు దిగారు. ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 మందికిపైగా పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. తమ కటాఫ్ మార్కుల్లో వ్యత్యాసాలు వచ్చాయని.. అర్హత కన్నా ఎక్కువ మార్కులు సాధించినా మెరిట్ లిస్ట్‌లో తమ పేరు లేదని పలువురు అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నష్టాల ఊబిలో సింగరేణి సంస్థ

### జీతాలు ఇవ్వలేని పరిస్థితి: కిషన్ రెడ్డి

గోదావరిఖని, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): లాభాల్లోకొనసాగిన సింగరేణిసంస్థ ప్రస్తుతం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సింగరేణిలో ఆర్థిక సంక్షోభం పై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్‌చేశారు. గోదావరి ఖనిలో సింగరేణి కార్మిక హక్కుల పరిరక్షణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ నేత కెంగర్ల మల్లయ్యబీఎంఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51శాతం వుందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణిని నడిపే శక్తి రాష్ట్రానికి లేకపోతే వెంటనే కేంద్రానికి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గుజరాత్‌లో బస్సు బోల్తా: ఐదుగురు మృతి

అహ్మదాబాద్, అక్టోబర్ 1 (ఆర్ఎన్ఎ): గుజరాత్‌లో 50 మంది ప్రయాణీకులతో వెళుతున్న బస్ బనస్కాంత జిల్లా అంబాజీ పట్టణం వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 5 గురు వ్యక్తులు మరణించారని అధికారులు వెల్లడించారు. త్రిశూలియా ఘాట్ వద్ద వేగంగా దూసుకుచ్చిన లగ్జరీ బస్సు బోల్తా పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణీకులున్నారు. ఘటనపై సమాచారం అందగానే 108 బృందంతో పాటు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బస్సులో చిక్కుకున్న వారిని స్థానికుల సహకారంతో పోలీసులు వెలుపలికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

## హైదరాబాద్‌లో వర్షాలకు దెబ్బ తిన్న రోడ్లు

### తక్షణ చర్యలు చేపట్టామన్న కమిషనర్

హైదరాబాద్, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): నగరంలో అకాల వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడ్డారని, అయితే అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ తెలిపారు. వర్షాల వల్ల పాడైన రహదారులకు మరమ్మతులు చేస్తున్నట్లు వెల్లడించారు. నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో ఇప్పటి వరకు 1043 డెంగీ కేసులు నమోదయ్యాయి. శిథిల భవనాల కూల్చివేత పక్రియ నిరంతరంగా కొనసాగిస్తాం. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్లాస్టిక్‌పై ప్రజల్లో మరింత అవగాహన, చైతన్యం రావాలి. బతుకమ్మ నిమజ్జనం కోసం కొలనులు సిద్ధం చేస్తున్నాం. అన్ని శాఖల సమన్వయంతో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తాం. బతుకమ్మ ఆఖరి రోజు ఎల్బీస్టేడియం నుంచి ట్యాంక్‌బండ్‌కు వరకు బతుకమ్మల ఊరేగింపు ఉంటుంది. పోలీసులు, జీహెచ్ఎంసీ బతుకమ్మకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తుందని తెలిపారు. అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీకి నిధుల కొరత లేదని పేర్కొన్నారు.




ఏపీ వార్తలు

## అధికారం చెలాయించడం కోసంకాదు

# గ్రామాలను బాగుచేసేలా కంకణం కట్టండి

**జన్మభూమి రుణం తీర్చుకునే అవకాశ వచ్చింది**

**ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయండి**

**కులమతాల జోలికి వెళ్లకుండా విధులు నిర్వర్తించాలి**

**గ్రామ సచివాలయ ఉద్యోగులకు నియామకపత్రాలు అందించిన జగన్**

విజయవాడ అక్టోబర్1 (ఆంఎన్ఎ): అధికారం చెలాయించడం కోసం ఉద్యోగం చేయడం లేదు.. సేవ చేయడం కోసమే ఈ ఉద్యోగం చేస్తున్నాం అనే విషయాన్ని ప్రతీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి గుర్తుపెట్టుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలు చూడొద్దన్నారు. . మీ పని తీరు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది. దేశంలో ఇటువంటి ప్రయోగం ఎవరూ చేసి ఉండరు... మీరంతా కలిసి దీనిని విజయవంతంగా పూర్తి చేస్తారనే నమ్మకం నాకుంద ముఖ్యమంత్రి అన్నారు. గ్రామ వాలంటీర్లతో అనుసంధానమై ప్రతీ పేదవాడికి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు చేరేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను అక్టోబర్ 2వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించబోతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ రాతపరీక్షల్లో అర్హత సాధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తై ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆయన సోమవారం నియామక పత్రాలు అందజేశారు. విజయవాడలోని ఏప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి సీఎం జగన్ సహా మంత్రులు కొడాలి నాని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్ని నాని, బొత్స సత్యనారాయణ, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన చెల్లెమ్మలు, తమ్ముళ్లకు అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్ర చరిత్రలోనే కాకుండా బహుశా దేశ చరిత్రలో కూడా అత్యంత తక్కువ సమయంలో.. అత్యంత పారదర్శకంగా ఏకంగా ఇరవై లక్షల మందికి పైగా ఉద్యోగాల కోసం పరీక్షలు రాయడం, ఎనిమిది రోజుల పాటు పరీక్షలు జరగడం, లక్షా నలభై వేల మందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు రావడం.. ఇది నిజంగా ఓ రికార్డు. దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయం. ప్రతీ రెండు వేల జనాభాకు సచివాలయం పెట్టడం.. తద్వారా పది నుంచి పన్నెండు ఉద్యోగాలు ఇవ్వడం అంటే ఉజ్జాయింపుగా ప్రతీ గ్రామానికి పది నుంచి పన్నెండు ఉద్యోగాలు ఇవ్వగలిగామని సగర్వంగా చెబుతున్నా. ప్రతీ యాభై ఇళ్లకు ఒక వాలంటీర్ ఉద్యోగం కూడా ఇచ్చాము. ఉద్యోగాల చరిత్రలో ఇదో సరికొత్త రికార్డు' అని పేర్కొన్నారు. అమెరికా వెళ్లినా సొంత గడ్డకు ఏదో చేయాలని ఎంతో మంది తపన పడతారు. అలాంటిది సొంత మండలంలోనే ఉద్యోగం చేసే భాగ్యం మీకు దక్కింది. మీ ప్రాంత ప్రజల రుణం తీర్చుకోండి. లంచాలు, వివక్షలేని పారదర్శక పాలన అందివ్వండి. వాలంటీర్లు, మీరు కలిసి పేదవాడి ముఖంలో ఆనందం తీసుకురండి. మనం అధికారం చేలాయించడానికి కాదు.. వారికి సేవ చేయడానికి ఉన్నాం. గ్రామాల్లో రేషన్ కార్డు నుంచి ఏది కావాలన్నా లంచం తీసుకునే పరిస్థితి ఉండేది. జన్మభూమి కమిటీలు వ్యవస్థను నాశనం చేశాయి. వాటి కారణంగా నేడు గ్రామాల్లో పాలనా వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉంది. అటువంటి పరిస్థితులను మన వ్యవస్థ ద్వారా మెరుగుపరచాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో 34 పనులు జరుగుతాయి. 72 గంటల్లోనే వారికి పరిష్కార మార్గం చూపేలా చర్యలు ఉంటాయి. మీరు చేసే సేవతో ప్రజల ముఖాల్లో వచ్చే చిరునవ్వును ఊహించుకోండి. ప్రతీ గ్రామ వాలంటీరు కు ఒక స్మార్ట్ ఫోన్ ఇస్తారు. జనవరి 1 నుంచి పూర్తిగా 500 సేవలు అందుబాటులోకి వస్తాయి. అదే విధంగా జనవరి 1 నుంచి కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు వస్తాయి. అర్హత ఉన్నవారికి తప్పకుండా లబ్ది చేకూరాలి' అని సీఎం జగన్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నిర్దేశర చేశారు. అదే విధంగా ఇంత కష్టపడి నియామక పక్రియ నిర్వహించిన ప్రతీ ఒక్క అధికారికి నా సెల్యూట్ అని అధికారులను ప్రశంసించారు.

సరికొత్త రికార్డు నెలకొల్పిన సీఎం జగన్

తరం యువతరానికి ఉన్న జీవితకాల లక్ష్యంగా మారింది ప్రభుత్వోద్యోగం. నాటి స్వాతంత్ర ఉద్యమం నుంచి ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు అన్నింటి వెనుక ఉన్న బలమైన నినాదం కూడా అదే. ఏ ప్రభుత్వమైనా సరే శాశ్వత ఉద్యోగాలు కల్పించి ఉపాధి మార్గం చూపించాలని ప్రజలు నిత్యం కోరుకుంటారు. రికార్డు స్థాయిలో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు నెలకొల్పారు. పదవీ ప్రమాణ స్వీకారం చేసిన నాడు తాను చెప్పిన మాటను అక్షర సత్యం చేసి అక్టోబర్ 2 నాటికి నిర్దేశిరచిన లక్ష్యాన్ని పూర్తి చేసి చూపిస్తున్నారు. తెలుగునేలపై సరికొత్త ఉద్యోగ విప్లవాన్ని సృష్టించి... అనతికాలంలోనే లక్షా 26 వేల 728 ఉద్యోగాలిచ్చిన ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారు. ప్రస్తుతం భారతదేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికి సాధ్యం కాని విషయాన్ని

సుసాధ్యం చేసి చూపించి తాను ప్రజల మనిషి అని మరోసారి చాటుకున్నారు. సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఇన్ని ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేవన్నది గమనార్హం. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్... ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా.. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 11 వేల 158 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేస్తోంది. అదే విధంగా 110 మున్సిపాలిటీల్లో 3,809 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వ్యవస్థలో పనిచేయడానికి 95 వేల 88 మంది గ్రామ సచివాలయ ఉద్యోగులు, 33వేల 581 మంది వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. ఒక్కో సచివాలయంలో 10 మంది ఉద్యోగులు పనిచేస్తారు. అంతేగాకుండా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలకు ఎంపికైన వారిని సొంత గ్రామంలో తప్ప వారు కోరుకున్న చోట ఎక్కడైనా నియమించాలని నిర్ణయించింది.

## అవినీతి రహితంగా గ్రామపాలన

**ఉపముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి**

విజయనగరం,అక్టోబర్1 (ఆర్ఎన్ఎ): అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా గ్రామ సచివాలయ నియామకాలు చేపట్టామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి అన్నారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పుష్ప శ్రీవాణి నియామక పత్రాలను అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాలకు ఎంపికైనవారికి అభినందనలు తెలిపారు. నూతనంగా ఎంపికైన ఉద్యోగులు ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించాలని కోరారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. పాదయాత్ర సమయంలో చెప్పిన విషయాలను ఇప్పుడు చేసి చూపిస్తున్నారని తెలిపారు. మహిళలకు యాభై శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అన్నింటా అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించుకున్నవారిపైన ప్రతిపక్ష నేత చంద్రబాబు అవాక్కులు చవాక్కులు విసిరారని విమర్శించారు. పేపర్ లీక్ అంటూ అసత్య ప్రచారాలు చేపట్టారని మండిపడ్డారు.

# లండన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**-హాజరైన ఎంపి సంతోష్ కుమార్**

లండన్,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్ డమ్(టాక్) ఆధ్వర్యంలో లండన్ లో చేనేత బతుకమ్మ - దసరా సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబురాలకు యూకే నలుమూలల నుంచి పన్నెండు వందలకు పైగా ప్రవాస కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత హై కమిషన్ ప్రతినిధి రాహుల్ ,స్థానిక హౌన్సలౌ మేయర్ టోనీ లౌకీలు హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ మరియు దసరాపండగ సందర్భంగా మహిళలందరు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్దంగా గౌరీ దేవికి పూజలు జరిపి బతుకమ్మ ఆట పాటలతో, కోలాటాల నృత్యాలతో, చప్పట్లు కలుపుతూ, రంగు రంగుల బతుకమ్మలతో సందడి చేశారు. బతుకమ్మల మధ్య కాకతీయ కళాతోరణం వేడుకలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి సంవత్సరం తెలంగాణ ప్రత్యేకతను చాటి చెప్పేలా వినూత్నంగా ఇలా ఏదో ఒక ప్రతిమను ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది చార్మినార్ ప్రతిమను ఏర్పాటు చేశారు. రాజ్యసభ ఎంపీ సంతోష్ కుమార్ జోగినపల్లి చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో ప్రజలంతా పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ప్రవాసులంతా ఎంపీ సంతోష్ చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రశంసించడమే కాకుండా మా వంతు బాధ్యతగా ముందుకు తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కలిపిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ భారీ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత హై కమిషన్ ప్రతినిధి రాహుల్ మాట్లాడుతూ.. చేనేత పేరుతో బతుకమ్మ వేడుకల్ని నిర్వహించడం వినూత్నంగా ఉందని, వీరి ప్రయత్నం ఫలించి నేత కుటుంబాలకు మేలు జరగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక హౌన్సలౌ మేయర్ టోనీ లౌకి మాట్లాడుతూ.. సంప్రదాయ తెలంగాణా వంటకాలతో పండగ భోజనం సొంత ఇంటిని తలిపించిందని ప్రశంసించారు.

టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కుర్మాచలం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు చేయూతనిస్తూ ఎన్నో కార్యక్రమాలు చేస్తుందన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర మంత్రి కేటీఆర్ కృషికి మా వంతు బాధ్యతగా చేనేతకు చేయూతనిస్తూ ఈ సంవత్సరం కూడా వేడుకలను 'చేనేత బతుకమ్మ మరియు దసరా' గా జరుపుకున్నామని తెలిపారు. చేనేతకు చేయూతగా మా వేడుకలని చేనేత బతుకమ్మ సంబరాలుగా చేయడం ద్వారా ఎన్నో నేతన్న కుటుంబాలకు మేలు జరిగిందని తెలిపారు. ఉద్యమ బిడ్డలుగా ప్రతి కార్యక్రమానికి సామాజిక బాధ్యతను జోడించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అన్నింటిని ప్రోత్సహించి విజయవంతం చేస్తున్న ప్రవాసులందరికి కృతజ్ఞతలు తెలిపారు. వీలైనంత వరకు ప్రవాసుల్లో చేనేతపై అవగాహన కల్పించి, వీలైనన్ని సందర్భాల్లో చేనేత వస్త్రాలు ధరించి నేత కుటుంబాలకు అండగా నిలవాలని కోరుతున్నట్టు తెలిపారు. రాజ్యసభ ఎంపీ సంతోష్ కుమార్ జోగినపల్లి గారు చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాక్ వ్యవస్థాపకుడు,ఎన్నారై టి. ఆర్. యస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం, టాక్ అధ్యక్షురాలు పవిత్ర రెడ్డి కంది, ఎన్నారై తెరాస యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, టాక్ ఉపాధ్యక్షురాలు స్వాతి బుడగం తదితరులు పాల్గొన్నారు.

## సైకో హల్చల్..పోలీసుల అరెస్ట్

అనంతపురం,అక్టోబర్1 (ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ సైకో వీరంగం సృష్టించారు. గాజు ముక్కలతో తనకు తానే గాయాలు చేసుకుంటూ హల్ చల్ చేశాడు. బస్టాండ్‌లో సెల్‌ఫోన్లు చోరీ చేస్తూ పట్టుబడ్డ నాని అనే సైకోను పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతన్ని ఆర్టీసీ బస్టాండ్ లోని అవుట్ పోస్ట్‌కు తరలించారు. దీంతో కోపోద్రిక్తుడైన నాని.. అవుట్ పోస్ట్‌లోని ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులను దుర్భాషలాడుతూ.. గాజు ముక్కలతో తనకు తానే గాయాలు చేసుకున్నాడు. గట్టిగా అరుస్తూ పోలీసులపై దాడి చేయబోయాడు. అప్రమత్తమైన పోలీసులు.. అతన్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# కూరగాయల వ్యాపారి కొడుక్కి టిక్కెట్

**ఘోషి నియోజకవర్గ అభ్యర్థిగా బిజెపి ప్రకటన**

లక్నోఅక్టోబర్1(ఆర్ఎన్ఎ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘోసి అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా కూరగాయలు అమ్ముకుని జీవించే నంద్‌లాల్ రాజ్‌భర్ కుమారుడు విజయ్ రాజ్‌భర్‌ను బీజేపీ ఎంపిక చేసింది.

తనకు బీజేపీ అత్యున్నత బాధ్యతను కట్టబెట్టిందని, తన తండ్రి మున్షిపురాలో ఫుట్‌పాత్‌పై కూరగాయలు అమ్ముతాడని విజయ్ చెప్పుకొచ్చారు. పార్టీ తనపై ఉంచిన గురుతర బాధ్య తను నిర్వర్తించేందుకు తాను శాయశక్తులా కృషిచేస్తానని చెప్పారు. తాను కూరగాయలు అమ్ముకుని జీవిస్తానని, తన కుమారుడి కష్టం ఫలించి పార్టీ అతనికి టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందని విజయ్ తండ్రి నంద్‌లాల్ రాజ్‌భర్ అన్నారు. విజయ్ బీజేపీలో చురుకుగా పనిచేయడంతో పాటు నగర పార్టీ అధ్యక్షుడిగా వ్యహరిస్తున్నారు. సహదత్‌పురా నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గతంలో పోటీచేసిన విజయ్ అక్కడి నుంచి గెలుపొందారు. అక్టోబర్ 21న 13 రాష్ట్రాల్లో జరిగే ఉప ఎన్నికలకు 32 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను బీజేపీ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

మేడ్చల్, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్‌వీఎం లాడ్జ్‌లో ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్(45) ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. కానిస్టేబుల్ ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# విధి నిర్వహణలో ముందుండాలి

**కర్నూలు జిల్లా పేరును నిలబెట్టాలి**

**సచివాలయ ఉద్యోగులకు బుగ్గన హితవు**

కర్నూలు,అక్టోబర్1 (ఆంఎన్ఎ): నూతన సచివాలయ ఉద్యోగాలకు ఎంపికైన ఉద్యోగులకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలకు జిల్లా నుంచి ఎంపికైన అభ్యర్థులకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా ఎమ్మెల్యేలు నియామక పత్రాలను అందజేశారు. జిల్లా పరిషత్ కార్యలయంలో సోమ వారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగుల నియా మకాల్లో కర్నూలు జిల్లా నంబర్ వన్‌గా నిలిచిందని, విధుల నిర్వహణలో కూడా నంబర్ వన్‌గా నిలవాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చారని కొనియాడారు. ఈ వ్యవస్థను అక్టోబర్ 2 నుండి ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో 1.27 లక్షల కొత్త ఉద్యోగాలు కల్పించ బోతున్నట్లు బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.27 లక్షల ఉద్యోగాలకు 20 లక్షల మంది పరీక్షలు రాశారని, లక్షమంది ఉద్యోగాల్లో చేరబోతున్నారని మంత్రి అన్నారు. కర్నూలు జిల్లాలో 9597 ఉద్యోగాలకు సోమవారం 5492 మందికి నియామక పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజల ఆదరణతో సీఎం అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం నవరత్నాలు పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాలు, వార్డుల్లో లక్షల్లో ఉద్యోగాలు నిజాయితీగా, అవినీతి రహితంగా కల్పించారని ప్రశంసించారు. రైతన్నల భూ సమస్యలను తీర్చడానికి కొత్త రెవెన్యూ చట్టం తెచ్చి, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేపట్టామని గుర్తు చేశారు. ఒక సెంటు భూమి కూడా తేడా రాకుండా సీఎం జగన్ చర్యలు చేపట్టారని తెలిపారు. 60 సంవత్సరాలు ఉమ్మడిగా ఉన్న రాష్ట్రం అందరూ వద్దు అనుకున్నా పునర్విభజన జరిగిందని, ఐటీ, సేవారంగం ఆదాయం అంతా తెలంగాణ రాష్ట్రానికి పోయిందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయ రాష్ట్రంగా మిగిలిందని, జీడీపీలో అతి తక్కువ ఉంది తమదేనని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో ఇంటింటికీ ఉద్యోగమని.. బాబు వస్తే జాబు అన్న చంద్రబాబు పరిశ్రమల్లో, ప్రభుత్వంలో ఎక్కడా ఉద్యోగాలు కల్పించలేదని విమర్శించారు. రాష్ట్రం విడిపోయిన అనంతరం తమది జనాభా ఎక్కువ ఉండి, ఆదాయం తక్కువ ఉన్న రాష్టంగా మిగిలిపోయిందని అన్నారు. జనాభా 58 శాతం ఉంటే ఆదాయం 44 శాతం ఉందన్నారు. తెలంగాణకు తక్కువ జనాభా, ఎక్కువ ఆదాయం పోయిందని, గత ప్రభుత్వం తప్పిదాల కారణంగా తమకు అప్పులు మిగిలాయిని దుయ్యబట్టారు. గత పాలకుల నిర్వాకం వల్లే నేడు రాష్ట్రంలో కరెంటు సమస్యలు ఎదురవుతున్నాయని, త్వరలోనే ఈ సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ పాలకులు అప్పులు చేసి, బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పెండింగ్ పెట్టి పోయారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ విమర్శించారు.

## ఆలయాలకు పాలకమండళ్లు ఏర్పాటు

అమరావతి,అక్టోబర్ 1 (ఆర్ఎన్ఎ): కోటి రూపాయల నుంచి 5 కోట్ల రూపాయల వార్షిక ఆదాయం ఉన్న 25 దేవాలయాలకు పాలక మండళ్లను ప్రభుత్వం నియమించింది. ఆలయాలకు, ట్రస్టులకు పాలక మండళ్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రస్టు బోర్డులు ఏర్పాటు చేసిన దేవాలయాల్లో అరసవెల్లి, మంగళగిరి, అంతర్వేది, పాలకొల్లు, అమరావతి ఆలయాలు ఉన్నాయి.

# సింగపూర్‌లో శ్రీవారి సేవలు

**అక్టోబర్‌లో ముహూర్తం నిర్ణయం**

**తరలి వెళ్లనున్న తిరుమల అర్చకులు**

అమరావతి,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): సింగపూర్‌లోని తెలుగు సమాజం ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం సమన్వయంతో అక్టోబర్ 12,13న అత్యంత వైభవంగా శ్రీనివాస కల్యాణమహోత్సవం నిర్వహించేందు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కల్యాణోత్సవానికి శ్రీవారు, శ్రీదేవి భూదేవి సమేతంగా తిరుమల నుండి సింగపూర్‌వాసులను కరుణించడానికి రానున్నారు. అంతేకాకుండా తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన అర్చకులు, వేదపండితులు తిరుమల క్షేత్రం నుంచి వచ్చి సింగపూర్లో ఆ శ్రీవారి కళ్యాణోత్సవాన్ని, ఇతర కైంకర్య సేవలను తిరుమలలోలానే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఇటువంటి సేవలు సింగపూర్‌లో నివసించే అందరికీ, తిరుమల వెళ్ళలేని వారికి కూడా ఇవి అందుబాటులో ఉండేలా, అందరినీ తరింపచేయాలనే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, తుడా ఛైర్మన్, టీటీడి బోర్డ్ సభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇతర దేవస్థాన అధికారులు, సిబ్బంది ఈ వేడుకలకు హాజరుకానున్నారు. గేలాంగ్ ఈస్ట్ అవెన్యూ 2, శ్రీ శివన్ టెంపుల్ ఎదురుగా ఉన్న ఓపెన్ లాన్స్ ఈ మహోత్సవానికి వేదిక కానుంది. దేదీప్యమానంగా జరగనున్న ఈ వేడుకలో భక్తజనం అందరూ పాల్గొని కనులారా తిలకించి, తరించి, తీర్థప్రసాదాలు, తిరుపతి లడ్డుప్రసాదం స్వీకరించి ఆ స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని సింగపూర్ తెలుగు సమాజం కోరింది.

## కాళేశ్వరంలో పెద్ద ఎత్తున అవినీతి:వివేక్

మంచిర్యాల, అక్టోబర్ 1(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్దయెత్తున అవినీతి జరిగిందని మాజీ ఎంపీ, బిజెపి నేత వివేక్ ఆరోపించారు. అన్నిశాఖల నిధుల్ని కాళేశ్వరానికి మళ్లించారని, కేవలం కేటీఆర్ కమిషన్‌ల కోసమే ఈ ప్రాజెక్టును చేపట్టారని వివేక్ విమర్శించారు. ఏపీ సీఎంతో లాలూచీపడి టీటీడీ బోర్డులో ముగ్గురికి పదవులు ఇప్పించుకున్నారని అన్నారు. 60 టీఎంసీల నీటిని ఏపీకీ ధారాదత్తం చేస్తున్నారని అన్నారు.


## పరీక్షా ఫలితాలే కారణమని చెప్పలేం

**ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీం వ్యాఖ్య**

న్యూఢిల్లీ,అక్టోబర్1 (ఆంఎన్ఎ): తెలంగాణలో ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలకు పరీక్ష ఫలితాలే కారణమని చెప్పలేమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఈ ఏడాది ఫలితాలు విడుదలయ్యాక కరెక్షన్లో తప్పులు జరిగి, భారీగా మార్కులు తప్పుగా రావడంతో చాలా మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని బాలల హక్కుల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్ బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరింది. అయితే ఈ పిటిషన్ పై విచారణ చేపట్టలేమని సుప్రీం కోర్టు సోమవారం నాడు స్పష్టం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యలకు ఇంటర్ ఫలితాలు వచ్చిన తీరే కారణమని చెప్పలేమని పేర్కొంది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం చెప్పింది. ఇదే తరహా పిటిషన్లను గతంలోనూ కొట్టివేసినట్టు సుప్రీంకోర్టు తెలిపింది.


తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో

తేజ ఆర్ట్ క్రియేషన్స్ నిర్వహణలో



నిజామాబాద్ పట్టణానికి చెందిన రచయిత

శ్రీ దారం గంగాధర్ నవల

"ఆరాటం" ఆవిష్కరణ



ముఖ్య అతిథి & ఆవిష్కర్త : డా॥ నందిని సిధారెడ్డి గారు, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి

సభాధ్యక్షులు : డా॥ నాళేశ్వరం శంకరం గారు, అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం

విశిష్ట అతిథి : శ్రీ మామిడి హరికృష్ణ గారు, సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ

గౌరవ అతిథి : డా॥ ఏనుగు నరసింహా రెడ్డి గారు, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి

ఆత్మీయ అతిథి : శ్రీ బైస దేవదాసు గారు, సంపాదకులు, నేటినిజం దినపత్రిక

పుస్తక పరిచయం : శ్రీ కె.పి. అశోక్ కుమార్ గారు, ప్రముఖ విమర్శకులు

వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్,

తేది : 04-10-2019 శుక్రవారం సాయంత్రం 6-00 గం॥లకు

# పాక్ మరో వివాదస్పద నిర్ణయం

## కర్తార్ పూర్ కారిడార్ ప్రాంభోత్సవంపై రాజకీయం
## ప్రధాని మోడీకి కాకుండా మన్మోహన్‌కు ఆహ్వానం

ఇస్లామాబాద్, అక్టోబర్1(ఆర్ ఎన్ఎ): ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ ప్రభుత్వం మరోసారి వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి భారత ప్రధాని నరేంద్రమోదీని కాదని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఆహ్వానం పంపాలని నిర్ణయించింది. కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మన్మోహన్ సింగ్‌ను ఆహ్వానించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పాక్ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీ తాజాగా వెల్లడించారు. 'కర్తార్‌పూర్ కారిడార్ ఓపెనింగ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇది పాక్‌కు ఎంతో ప్రతిష్టాత్మకం. సుధీర్ఘ చర్చ, సంప్రదింపుల తర్వాత మాజీ భారత ప్రధాని మన్మోహన్‌ను ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పిలువాలని నిర్ణయించుకున్నాం' అని ఖురేషీ వివరించారు. ఈ విషయంలో అధికారికంగా ఆహ్వాన పత్రిక కూడా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు మత విశ్వాసం ఉంది. ఆయనకు పాక్‌లో ఎంతో గౌరవం ఉంది. అందుకే మేము అతన్ని ఆహ్వానించబోతున్నామని మంత్రి వివరించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండగా నవంబర్ 9 కారిడార్‌ను ప్రారంభించాలని ఇరుదేశాలు నిర్దేశించుకున్నాయి. సిక్కుల గురువైన గురు నానక్ 550వ జయంతి ఉత్సవాలు నవంబర్‌లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహెబ్ గురుద్వారా, పంజాబ్ గురుదాస్‌పూర్ జిల్లాలోని దేరా బాబా నానక్ గురుద్వారాలను కలుపుతూ ప్రత్యేక కారిడార్‌ను భారత్,పాక్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

# జైలులోనే చిదంబరం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పీ చిదంబరానికి ఢిల్లీ హైకోర్టులో మరోసారి నిరాశే ఎదురైంది. ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చిదంబరం దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. సీనియర్ నేత చిదంబరానికి బెయిల్ ఇస్తే సాక్ష్యులను ప్రభావితం చేస్తారని సీబీఐ వాదించింది. జాతీయ దర్యాప్తు సంస్థ వాదనలతో ఏకీభివించిన న్యాయమూర్తి సురేష్ కైట్ కాంగ్రెస్ నేత బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు. 74 ఏళ్ల చిదంబరం కేంద్ర హోం, ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో అరెస్టయిన కాంగ్రెస్ సీనియర్ నేత తీహార్ జైలులో జుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కేసు విచారణ పురోగతిన ఉన్న పరిస్థితుల్లో బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని సీబీఐ తరఫున్యాయవాది హైకోర్టులో వాదించారు. బెయిల్‌పై బయటకు వస్తే సాక్ష్యాధారాలను తారుమారు చేస్తారని ఆరోపించారు. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది అమిత్ మహాజన్ వాదనలు వినిపించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన చిదంబరం తన కేసును తానే వాదించుకుంటానని గతంలో కోరినా న్యాయస్థానం అంగీకరించలేదు. కాగా తమ క్లయింట్ సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రసక్తేలేదని చిదంబరం తరఫు న్యాయవాది అర్శదీప్ సింగ్‌చెప్పారు. ఆర్థిక నేరారోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రికి ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ మంజూరు చేయవద్దని సీబీఐ కోరింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో 2017 మే 15న సీబీఐ కేసు నమోదు చేసింది. అదే ఏడాది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. చిదంబరం అక్టోబర్ 3వరకూ తీహార్ జైలులో జుడీషియల్ కస్టడీలో ఉంటారు.

# కశ్మీర్‌లో దారుణమైన పరిస్థితులు

**- కర్ఫ్యూతో కేంద్ర పాలన సాగిస్తుంది**
**- పాక్ జాతిపిత జిన్నాతాత రాజ్‌పుత్ వంశీయుడే**
**- గాంధీ సిద్ధాంతాలకు విరుద్ధంగా కేంద్రం పాలన సాగిస్తుంది**
**- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్**

రాజమండ్రి, అక్టోబర్1(ఆర్ఎన్ఎ) : కశ్మీర్‌లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని, కర్ఫ్యూతో కేంద్రం పాలన సాగిస్తుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాజమండ్రిలో ఉండవల్లి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. గాంధీజీ- నెహ్రూ వేర్వేరు కాదని.. గాంధీ ఏం చెప్పారో.. నెహ్రూ అదే చేశారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు నిర్వహించుకుంటున్న వేళ కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌లో కర్ఫ్యూ నడిపిస్తోందని విమర్శించారు. అసలు కశ్మీర్‌లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియడం లేదని.. దారుణ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. అక్కడికి ఎవరినీ వెళ్లనీయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదేనని అమిత్ షా చెబుతున్నారని, పాకిస్తాన్ కూడా మనదే అని, గాంధీని, నెహ్రూను, కాంగ్రెస్ పార్టీని అంబేద్కర్ ఎన్నడూ సమర్థించలేదన్నారు. ఆయన వాస్తవాలను మాత్రమే చెప్పారని అన్నారు. నిజానికి ఆర్టికల్ 370ని రద్దు చేస్తాననడంలో తప్పులేదని, కానీ బీజేపీ పుట్టిందే ఈ సిద్ధాంతం మీద అని, ఆర్టికల్ రద్దు అనేది డిప్లమసీతో చేయాలి. సైన్యంతో కాదంటూ మోదీ సర్కారు తీరును విమర్శించారు. పాకిస్తాన్ జాతిపిత మహ్మద్ జిన్నాతాత రాజ్‌పుత్ వంశానికి చెందినవారని, అబ్దుల్ భట్ కూడా బ్రాహ్మణుడే అని, వీరంతా ఇస్లాంలోకి వెళ్లినవారేనని అని తెలిపారు. సాయిబాబా గుడికి వెళ్లొద్దని శంకరాచార్యా పీఠాధిపతే చెప్పారని, నల్లధనానికి నోట్లరద్దు ఎలా పరిష్కారం కాదో... ఉగ్రవాద సమస్యకు ఇప్పుడున్న పరిస్థితి పరిష్కారం కాదని ఉండవెల్లి అభిప్రాయపడ్డారు. అంతేకాదు నేడు గూగుల్ సెర్చ్‌లో ఆర్టికల్ 370 అనేది లేదని, కశ్మీర్ ఎంపీలు కూడా భారత రాజ్యాంగం మీదనే ప్రమాణం చేస్తున్నారని గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం గాంధీ సిద్ధాంతానికి విరుద్ధంగా పనిచేస్తోందని ఉండవల్లి విమర్శలు గుప్పించారు.

# ఫడ్నవీస్‌కు ఝలక్ ఇచ్చిన సుప్రీంకోర్టు

**- బాంబే హైకోర్టు ఇచ్చిన క్లీన్‌చిట్ తిరస్కరణ**

న్యూఢిల్లీ,అక్టోబర్1(ఆర్ఎన్ఎ) : మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు సుప్రీంకోర్టు జలక్ ఇచ్చింది. తన ఎన్నికల అఫిడవిట్‌లో క్రిమినల్ కేసుల గురించి వెల్లడించని కేసులో విచారణ చేపట్టాల్సిందే అని సుప్రీం పేర్కొన్నది. సీజేఐ రంజన్ గగోయ్‌తో పాటు జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుధ్ బోస్‌లతో కూడిన ధర్మాసనం ఈమేరకు మంగళవారం తీర్పునిచ్చింది. బాంబే హైకోర్టు ఇచ్చిన క్లీన్ చిట్‌ను సుప్రీం తిరస్కరించింది. దీంతో సీఎం ఫడ్నవీస్ చిక్కుల్లో పడ్డారు. మహారాష్ట్రకు చెందిన సతీశ్ ఊకే .. సీఎం ఫడ్నవీస్‌పై కేసు దాఖలు చేశారు. ఫడ్నవీస్‌పై పలు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి గురించి ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదని సతీశ్ కోర్టులో కేసు వేశారు. ఆ కేసులను రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్టులోని సెక్షన్125 ప్రకారం విచారణ చేపట్టాలని మంగళవారం సుప్రీం ఆదేశించింది. కొత్తగా ఫిర్యాదును స్వీకరించాలని ట్రయల్ కోర్టును కూడా ఆదేశించింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ సీఎం అభ్యర్థిగా మరోసారి ఫడ్నవీస్ పోటీ చేయనున్నారు. అయితే సుప్రీం తీర్పుతో ఫడ్నవీస్ భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది.




రంజని,
తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్ 500004

**నేటినిజం దినపత్రిక -రంజని**
**విశ్వనాథ పద్య కవితా పోటీలు 2019**

మఱల నిదేల రామాయణం బన్నచో నీ ప్రపంచక మెల్ల నెల్ల వేళ
దినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్ళుతనరుచి బ్రదుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన
తలచిన రామునే తలఁచెద నేనును నా భక్తిరచనలు నావిగాన...

అన్న "మాటలాడే వెన్నెముక, పాటపాడే సుషుమ్న, నిన్నటి నన్నయ్యభట్టు, ఈనాటి కవిసామ్రాట్టు, ప్రథమ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ". ఆయన పట్టి సాధించని సాహిత్య ప్రక్రియ లేదు, మెట్టి చూడని సారస్వతమూ లేదు. "సంస్కృతంలో ఇప్పుడు వ్రాస్తే ప్రాచీన కవుల పరంపరలో ఏ వెయ్యిన్నొక్కటో వాణ్ణో అవుతాను. తెలుగులోనంటారా పన్నెండుగురు ప్రాచీన మహాకవుల తర్వాత పదమూడో వాణ్ణి నేను " అని స్వయంగా ప్రకటించుకున్నట్లే శిల్ప వైలక్ష్యంలో, భావన సౌకుమార్యంలో, దేశిచ్ఛందో విశేషంలో, కల్పనా సాహిత్యంలో విశ్వనాథ వారి తరువాతే ఎవరైనా.

'గిరి కుమారుని ప్రణయ గీతాలు' అయన తొలి కవిత. ఆ తరువాత ఆంధ్ర ప్రశస్తి , ఋతుసంహారం, రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు రాసారు. కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్లి, టానిసల దీవి, ఉయ్యాలతాళ్లు వంటి గేయ కావ్యాలు, ఏకవీర, వేయిపడగలు, చెలియలికట్ట, బద్దన్నసేనాని, సముద్రపుదిబ్బ, మ్రోయుతుమ్మెద వంటి నవలలు, నర్తనశాల, సాప్తిక ప్రళయం, అనార్కలి, వేనరాజు, త్రిశూలం, కళింగరాజ్యం వంటి నాటకాలు, శర్మిష్ట వంటి సంస్కృత నాటకాలు, ఎన్నో కథలు, పురాణవైర గ్రంథమాల పేరుతొ ఎన్నో నవలలు...మొత్తం లక్ష పుటలకు పైగా సాహిత్యం అందించిన విశ్వనాథ సత్యనారాయణ గారు ' రంజని' ని ఎన్నో పర్యాయాలు సందర్శించారు. అకౌంటెంట్ జనరల్ గా పదవి విరమణ చేసి అమెరికాలో ఉంటున్న శ్రీ ఏ. సత్యవర్ధన, IA & AS గారి సౌజన్యంతో రంజని తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ పేరు మీద 2008 నుంచి '**రంజని- విశ్వనాథ పద్య కవితా పోటీలు**' నిర్వహిస్తోంది.

బహుమతులు : ప్రథమ బహుమతి రూ. 2,000/- , ద్వితీయ బహుమతి రూ. 1,500 /- మూడు తృతీయ బహుమతులు (500/-) మొత్తం 5,000/- (యోగ్యతాపత్రాలతో సహా)

నిబంధనలు: ఏ ఛందస్సు లోనైనా ఒక అంశం మీదే 12 పద్యాలకు తక్కువ కాకుండా ఉండాలి. సామాజికత తప్పనిసరి. ఇంతవరకు ప్రచురణ, ప్రసారంకానివి, దేనికి అనువాదం, అనుక(స)రణ కాని పద్య కవితల్ని మాత్రమే పంపాలి. ఇందుకు సంబంధించిన హామీ పత్రాన్ని విడిగా జతపరచాలి. ఒకరు ఎన్ని పద్యకవితాలైనా పంపవచ్చు. పద్యకవితాల్ని కాగితంపై ఒక వైపే రాయాలి. పద్య కవితలు పంపే కవరు పై ' రంజని- పద్యకవితా పోటీలు- 2019' అని పేర్కొవాలి. పద్యకవిత ఉన్న కాగితం పై పేరు, విలాసం తదితర వివరాలు వ్రాయకూడదు. పూర్తిపేరు, చిరునామా వివరాలు హామీ పత్రంలో మాత్రమే పేర్కొనాలి. విజేతలకు ఫలితాలను నేరుగాను, పత్రిక ముఖంగాను తెలియచేస్తాం. ఎంపికైన పద్యకవితలను ప్రచురించే హక్కు రంజనిదే. న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.

చిరునామా: ప్రధాన కార్యదర్శి, రంజని, తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్, హైదరాబాద్— 500004.

చివరితేదీ: 31 అక్టోబర్ 2019

నందిరాజు పద్మలత జయరాం
అధ్యక్షులు
9492921383

మట్టిగుంట వెంకట రమణ
ప్రధాన కార్యదర్శి
83748


## ఏపీ వార్తలు

# ఇంద్రకీలాద్రిపై ఘనంగా శరన్నవరాత్రి



గాయత్రీదేవిగా అవతరించిన దుర్గమ్మ



దర్శనాల కోసం బారులు తీరిన భక్తులు

విజయవాడ,అక్టోబర్1(ఆర్ఎన్ఎ): బెజవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శరన్నవరాత్రుల్లో మూడో రోజైన మంగళవారం ఆశ్వయుజ శుద్ధ తదియ కారణంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ గాయత్రీదేవిగా భక్తులకు సాక్షాత్కరించింది. వేదమూర్తిగా ప్రసిద్ధి పొందిన ఈ తల్లి ... ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ భక్తులను అనుగ్రహిస్తుంది.పంచ ముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్టాన దేవత అయిన గాయత్రీదేవిని పూజిస్తే సకల ఉపద్రవాలూ తొలగి బుద్ధి తేజోవంతం అవుతుందని భక్తుల నమ్మకం.మంగళవారం వంగ, ఆకుపచ్చ, బంగారు వన్నెల చీరల్లో కొలువుదీరిన అమ్మవారికి నైవేద్యంగా పులిహోర, కేసరి, పులగాలను సమర్పించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు శరదృతువులో వచ్చేవి కనుక, ఇవి శరన్నవరాత్రులుగా ప్రసిద్ధమయ్యాయి. దేవిని ఆరాధిస్తారు కాబట్టి, 'దేవీ నవరాత్రులు' అనీ వీటిని వ్యవహరిస్తారు. పరాశక్తికి మరో పేరు- శారద. ఆ తల్లిని అర్చించే రాత్రులు కావడంతో, వీటికి 'శారద నవరాత్రులు' అనే పేరూ ఉంది. నవరాత్రి ఉత్సవాలు సంవత్సరంలో రెండు సార్లు వస్తాయి. చైత్రమాసంలో వచ్చేవి వసంత నవరాత్రులు. ఈ ఆశ్వయుజ మాసంలో వచ్చేవి శరన్నవరాత్రులు. ఈ రెండు రుతువుల్లోనూ ఆదిశక్తిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. దుష్టులైన రాక్షసుల్ని సంహరించేందుకు అమ్మవారు తొమ్మిది అవతారాలు ధరించిందని చెబుతా రు. తొమ్మిది విధాలైన అనుష్ఠానాలు, విధి విధానాలతో తొమ్మిది రోజుల వ్రతదీక్ష చేపట్టిందని, ఆ శక్తి వల్ల కలిగిన అసమాన బలంతోనే పదో రోజున రాక్షసుల్ని మట్టుపెట్టిందని పురాణ కథనం. అమ్మవారు మొదటి రోజున శైలపుత్రిగా, హైమవతిగా, పార్వతిగా పూజలందుకుంటుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై 11రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. వినాయక ఆలయం నుంచి క్యూలైన్లు ప్రారంభమయ్యాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.దుర్గమ్మకు భక్తులు చేయించిన కొత్త ఆభరణాలను దసరా ఉత్సవాల్లో వినియోగిస్తున్నారు. ముఖ్యంగా నాలుగున్నర కోట్ల రూపాయలతో చేయించిన స్వర్ణకవచం, వజ్రకిరీటం, త్రిశూలంతో అమ్మవారిని అలంకరించారు. పూర్తిస్థాయిలో ఆభరణాల అలంకరణతో దుర్గమ్మ నిజంగానే కనకదుర్గమ్మగా భక్తులకు సాక్షాత్కరిస్తోంది. నాలుగు వరుసల్లో భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తున్నారు. కొందరు భక్తులు దుర్గాఘాట్ లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

### దుర్గమ్మను దర్శించుకున్న గవర్నర్ దంపతులు


గవర్నర్ హరిచందన్ దంపతులు బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. గవర్నర్ దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఈవో సురేష్‌బాబు ఆలయ మర్యాదలతో గవర్నర్ దంపతులకు స్వాగతం పలికారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు కనకదుర్గమ్మ గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

### వలంటీర్ల నిరసన

ఇంద్రకీలాద్రిపై ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. దుర్గమ్మ అంతరాలయం పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న.. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను పోలీసులు బయటకు పంపేశారు. దీంతో ఆగ్రహించిన వలంటీర్లు నిరసనకు దిగారు. క్యూలైన్లు సజావుగా సాగడంలో వలంటీర్ల పాత్రే కీలకమని పేర్కొన్నారు. దుర్గగుడి అధికారులు వివరణ ఇవ్వాలని వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు.

# బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు

## చిన్నశేష వాహనంపై ఊరేగిన శ్రీవారు



తిరుమల, అక్టోబర్ 1 (ఆర్ఎన్ఎ):శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై నవనీతకృష్ణ అలంకారంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నెమలి పింఛం, పిల్లనగ్రోవి, నవనీతంతో ఉన్న కృష్ణుడి రూపం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఏనుగులు, అశ్వాలు ఠీవిగా ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, మంగళ వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ వాహన సేవ అత్యంత రమణీయంగా జరిగింది. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకి నాగలోకానికి రాజుగా భావిస్తారు. శ్రీ వైష్ణవ సంప్రదాయానుసారం భగవంతుడు శేషి, ప్రపంచం శేషభూతం. శేషవాహనం ఈ శేషిభావాన్ని సూచిస్తుంది. చిన్నశేష వాహనాన్ని సందర్శిస్తే భక్తులకు కుటుంబ శ్రేయస్సుతోపాటు కుండలినీయోగ సిద్ధిఫలం లభిస్తుందని ప్రశస్తి. అనంతరం సాయంత్రం 6 నుంచి 7 గంటల వకు ఊంజల్‌సేవ వైభవంగా జరుగనుంది. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఈవో అనిల కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి, సివిఎస్వో గోపినాథ్‌జెట్టి, ఎస్వీబీసీ ఛైర్మన్ పృథ్వీరాజ్, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాధనంతో ఒకమతాన్ని పోషిస్తున్నారు

**- హిందూ దేవాలయాల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్నారు**
**- ఇసుక కొరతపై 4నుంచి ఆందోళనలు**
**- ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ**

గుంటూరు, అక్టోబర్1 (ఆర్ఎన్ఎ) : ప్రజా ధనంతో కేవలం ఒక మతాన్ని పెంచి పోషిస్తున్నారని, ఆ మతాన్ని బలోపేతం చేసేందుకు ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. మంగళవారం ఆయన గుంటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో కన్నా మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిందూ దేవాలయాల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ఇసుక పాలసీ అమల్లోకి వచ్చి నెల రోజులు కావస్తున్నా.. సామాన్యుడికి ఇసుక లభ్యం కావడం లేదని విమర్శించారు. కేంద్ర తీసుకువచ్చిన 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లు ఏపీలో అమలు కావడం లేదని, ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 4న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఇసుక కొరతపై 7న భిక్షాటన చేపడతామని, 11న పోలవరంలో పర్యటిస్తామని తెలిపారు. పాలనలో టీడీపీ, వైసీపీ మధ్య ఎలాంటి తేడా లేదని అన్నారు.

# కసాయి తండ్రి

- నెలరోజుల పసిగుడ్డును నీటితొట్టెలో పడేసి చంపిన తండ్రి
- రెండవ కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడమే కారణం
- హంతకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- భద్రాచలం జిల్లాలో దారుణ ఘటన

భద్రాద్రి కొత్తగూడెం,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రేగుంటలో అత్యంత దారుణ ఘటన చోటు చేసుకుంది. నెలరోజుల పసిగుడ్డును పాశవికంగా చంపేసాడు కన్నతండ్రి. భార్యకు రెండవసారి కూడా ఆడపిల్లే పుట్టిందనే కోపంతో విచక్షణ మరచిపోయే తండ్రి కన్నబిడ్డ పాలిట కాలయ ముడిగా మారాడు. 30రోజుల పసిబిడ్డను..నీటి తొట్టెలో పడవేసి చంపేశాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి కసాయి తండ్రి సూర్యతేజను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రేగుంటలో నివసిస్తున్న సూర్యతేజకు మొదట ఓ ఆడబిడ్డ ఉంది. రెండవసారి గర్భందాల్చిన భార్యకు కాన్పులో మరో ఆడపిల్ల పుట్టింది. అప్పటి నుంచి అసంతృప్తితో రగిలిపోతున్న సూర్యతేజ ఆ బిడ్డను ఎలాగైనా వదిలించుకోవాలనుకున్నాడు. అదనుకోసం వేచి చూశాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున భార్య బహిర్భూమికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన సూర్యతేజ నెలరోజుల పసిబిడ్డ అని కూడా చూడకుండా ఇంటి వెనుక ఉన్న నీటి తొట్టెలో పడవేయటంతో చిన్నారి మృతి చెందింది. తరువాత ఏమీ తెలియనట్లుగా ఉండిపోయాడు. బైటకు వెళ్లి వచ్చిన భార్య మంచంపై ఉండే బిడ్డ



కనపించకపోవటంతో భర్తను అడిగింది. నాకేమి తెలీదు నేను కూడా బైటకు వెళ్లాను అన్ని బుకాయించాడు. దీంతో కడుపుడు శోకంతో బిడ్డకోసం పిచ్చిదాన్లా వెతికింది. కనిపించకపోవటతో దగ్గర్లో ఉన్న తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పింది. వారుకూడా స్థానికులు సహాయంతో చుట్టుపక్కల అంతా వెతికారు. కానీ బిడ్డ కనిపించలేదు. ఎవరైనా ఎత్తుకుపోయారేమోనని భయపడ్డారు. కానీ ఇంటి వెనుక నీటితో తొట్టెలో ఉన్న పసిబిడ్డ విగతజీవిగా పడి ఉండటం చూసిన తల్లి గుండెలవిసేలా భోరుమని ఏడ్చింది. అనుమానం వచ్చిన భార్య.. స్థానికులు సూర్యతేజను నిలదీయగా.. రెండవసారి కూడా ఆడపిల్ల పుట్టిందని చంపేశాను అని చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు సూర్యతేజకు దేహశుద్ధి చేసి.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసుకుని సూర్యతేజను అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు.

# అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్.. మోదీ అలా అనలేదట

హైదరాబాద్, అక్టోబర్ 1: ఇటీవల అమెరికాలో జరిగిన హౌడీ మోదీ సభలో ప్రసంగిస్తూ అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్ అని ప్రధాని మోదీ అన్న విషయం తెలిసిందే. అమెరికా దేశాధ్యక్షుడిగా ట్రంప్ రెండవ సారి పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆ సభలో మోదీ మాట్లాడుతూ ఆ కామంట్ చేశారు. అయితే మోదీ అలా అనలేదని ఇవాళ విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. అమెరికా టూర్‌లో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ కామెంట్‌ను వక్రీకరిస్తున్నారన్నారు. మోదీ చెప్పిన మాటలను తప్పుగా చిత్రీకరిస్తున్నారని జైశంకర్ అన్నారు.

2020లో జరగనున్న అమెరికా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకుంటోందన్న ఆరోపణలు వచ్చాయి. ప్రధాని మోదీ ప్రత్యక్షంగా ట్రంప్‌కు మద్దతు ఇస్తున్నట్లుగా మాట్లాడరని కూడా కొందరు విమర్శించారు. అయితే మోదీ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని జైశంకర్ అనడాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ తీవ్రంగా ఆక్షేపించారు. ప్రధాని మోదీ అసమర్థత్వాన్ని కప్పిపుచ్చుతన్న కేంద్ర మంత్రికి థ్యాంక్స్ అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. అంతర్జాతీయ దౌత్యం ఎలా చేయాలో కాస్త మోదీకి నేర్పాలంటూ జైశంకర్‌ను కోరారు.

# బిగ్గరగా ఏడవండి బాబు గారు..!



అమరావతి, అక్టోబర్ 1: ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు స్మారక సభలో కూడా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం రివర్స్ టెండరింగునే కలవరించాడని వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి విమర్శించారు. ట్విటర్లో ఇవాళ పలు అంశాలపై ఆయన స్పందించారు.

'గతంలో 650 కోట్లు ఎక్కువ కోట్ చేసిన మేఘా ఇప్పుడు తక్కువకు ఎలా కోట్ చేస్తుందని గగ్గోలు పెడుతున్నాడు చంద్రబాబు. కమిషన్ల కోసం కక్కుర్తి పడింది మీరే కదా. ఇప్పుడు ఎవరికీ రూపాయి కూడా ఇవ్వనవసరం లేదు. అదీ తేడా. అనుభవజ్ఞుడని నమ్మి ప్రజలు గెలిపిస్తే చంద్రబాబు చేసిన దుర్మార్గాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్టీపీసీ సహా విద్యుత్తు సంస్థలకు 20 వేల కోట్లపైనే బకాయిలు పెట్టి పోయాడు. జెన్‌కోను ధ్వంసం చేసి ప్రైవేటుకు దోచిపెట్టాడు. డిస్కమ్‌లను అప్పుల్లో ముంచి ఇప్పుడు చీకటి రోజులొచ్చాయని దొంగ ఏడుపు మొదలెట్టాడు. ఒక్క నోటిఫికేషన్‌తో 1.27 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. ఇక ప్రతి ఏటా నియామకాలు ఉంటాయని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. బిగ్గరగా ఏడవండి చంద్రబాబు గారు. మీ శాపనార్థాలు నిరుద్యోగులకు ఆశీర్వాదాలుగా మారతాయి. 1000 నిరుద్యోగ భృతి రోజులు పోయి ఉద్యోగులుగా గర్వించే రోజులు వచ్చాయని' విజయ సాయిరెడ్డి పేర్కొన్నారు.

# మూసీ 2గేట్లు ఎత్తివేత

## ఎగువ నుంచి వరదనీటి రాకతో చర్య



సూర్యాపేట,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ): మూసీ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి దిగువకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు అధికారులు. ప్రాజెక్టు ఇన్‌ఎ÷-లో 2 వేల క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన క్రమంలో మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిసర ప్రాంతాల ప్రజలు, పర్యాటకులు, దిగువ గ్రామాల జాలర్లు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. ఇదిలావుంటే శ్రీశైలం నుంచి నాగార్జునాసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో సోమవారం 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులకు ప్రస్తుతం 589.80 అడుగులుగా ఉంది. జలాశయం ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,414 క్యూసెక్కులు, 4 క్రస్ట్ గేట్ల ద్వారా 59,892 క్యూసెక్కులు, ఎడమకాల్వ నుంచి 5800 క్యూసెక్కులు, కుడికాల్వ నుంచి 9767 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, డీటీ గేట్సు ద్వారా 10, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి మొత్తం 1,11,583 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది.

# సీఎం ఫడ్నవీస్‌కు సుప్రీం జలక్

హైదరాబాద్, అక్టోబర్ 1: మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు సుప్రీంకోర్టు జలక్ ఇచ్చింది. దీంతో సీఎం ఫడ్నవీస్ చిక్కుల్లో పడ్డారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో క్రిమినల్ కేసుల గురించి వెల్లడించని కేసులో విచారణ చేపట్టాల్సిందే అని సుప్రీం పేర్కొన్నది. సీజేఐ రంజన్ గగోయ్‌తో పాటు జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుధ్ బోస్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. బాంబే హైకోర్టు ఇచ్చిన క్లీన్ చిట్‌ను సుప్రీం తిరస్కరించింది. మహారాష్ట్రకు చెందిన సతీశ్ ఊకే .. సీఎం ఫడ్నవీస్‌పై కేసు దాఖలు చేశారు. ఫడ్నవీన్‌పై పలు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి గురించి ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదని సతీశ్ కోర్టులో కేసు వేశారు. ఆ కేసులను రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్టులోని సెక్షన్ 125 ప్రకారం విచారణ చేపట్టాలని ఇవాళ సుప్రీం ఆదేశించింది. కొత్తగా ఫిర్యాదును స్వీకరించాలని ట్రయల్ కోర్టును కూడా ఆదేశించింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ సీఎం అభ్యర్థిగా మరోసారి ఫడ్నవీస్ పోటీ చేయనున్నారు. అయితే సుప్రీం తీర్పుతో ఫడ్నవీస్ భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది.

# మద్యం దుకాణాల ముందు క్యూ

## నేటి బంద్‌తో ముందస్తు కొనుగోళ్లు

## పశ్చిమలో మద్యం అమ్మకాలను అడ్డుకున్న మహిళలు

అమరావతి,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ): ప్రభుత్వ మద్యం దుకాణాలు వచ్చేశాయి. ఇంకేముంది రెండు రోజులుగా మందు దొరక్క ఇబ్బందివడ్డ మందుబాబులు మంగళవారం ఉదయం 8 గంటల నుండే క్యూ లు కట్టారు. ప్రైవేట్ మద్యం దుకాణాలను ఖాళీ చేయాల్సి ఉండటంతో అన్ని మద్యం షాపుల్లోనూ మద్యం స్టాకు లేకుండా ఉంచుకున్నారు. దీంతో గత రెండు రోజులుగా మద్యం లేక మందుబాబులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఉదయం 11 గంటల కు ప్రారంభమైన ఈ ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మద్యం ప్రియులు ఉదయం 8 గంటల నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ఈ ప్రభుత్వ మద్యం దుకాణాల సమయం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే ఉండటంతో మద్యం ప్రియులు కంగారుపడుతున్నారు. దీనికితోడు బుధవారం గాంధీ జయంతి కావడంతో మంగళవారం రాత్రి 8 గంటలకు ఈ మద్యం దుకాణాలకు సీల్ పెడతారని ముందుగానే భారీ ఎత్తున మద్యం ప్రియులు మద్యం దుకాణం వద్ద క్యూ కట్టారు. ఇదిలావుంటే ఇళ్ల మధ్య బ్రాంది షాపు వద్దంటూ.. ఆలమూరు మహిళలు పోలీసులను అడ్డుకున్న వైనం మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలో చోటు చేసుకుంది. పెనుమంట్ర మండలం ఆలమూరు లోని కొయ్యేటిపాడు రోడ్డు లో ప్రభుత్వ బ్రాంది షాపు అమ్మకాలను స్థానిక మహిళలు అడ్డుకున్నారు. మహిళలు, విద్యార్థులు తిరిగే రోడ్డు పై ఇళ్ల మధ్య బ్రాందీ విక్రయాలు సరికాదంటూ మహిళలు ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. రాష్ట్రంలో ప్రైవేటు మద్యానికి తెరపడి, నేటినుంచి సర్కారీ మద్యం అందుబాటులోకి వచ్చింది. కొన్ని దశాబ్దాలుగా ప్రైవేటు లైసెన్సీల చేతిలో ఉన్న మద్యం వ్యాపారం సంపూర్ణంగా ప్రభుత్వం చేతికొస్తోంది. అయితే మద్యం విక్రయాలు ఉదయం 11నుంచి రాత్రి 8 గంటల వరకే పరిమితం చేయడం తాజా విశేషం. ప్రైవేటు మద్యం వ్యాపార విధానానికి వైసీపీ ప్రభుత్వం పూర్తిగా స్వస్తి పలికింది. ప్రస్తుతం ఉన్న 4380 షాపులను సర్కారీ పాలసీలో 20శాతం కుదించి 3500కు పరిమితం చేసింది. అయితే సిబ్బంది కొరత, ఇతర కారణాల వల్ల తొలిరోజు 3,330 షాపులు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగిలినవి వారం పది రోజుల్లో ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. అయితే పలుచోట్ల సిబ్బంది కొరత షాపులకు అవాంతరంగా మారింది. ప్రస్తుతం ప్రైవేటు షాపులు ఎలా ఉన్నాయో, ప్రభుత్వ షాపులు కూడా అలాగే ఉంటాయని, చిన్నచిన్న మార్పులు తప్ప పెద్దగా వ్యత్యాసం ఉండదని ఎక్సైజ్ కమిషనర్ ఎంఎం నాయక్ చెప్పారు. అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మరోవైపు నాటుసారా, ఎన్‌డీపీఎల్ రాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నా మన్నారు. 31 ఎక్సైజ్ చెక్‌పోస్టులను బలోపేతం చేస్తున్నామన్నారు. మద్యం షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా చూస్తామన్నారు. కొత్త సిబ్బందికి సహకారం అందించేందుకు కొన్ని రోజుల పాటు ఇప్పుడు షాపుల్లో ఉంటున్న కానిస్టేబుళ్లను యథావిధిగా కొనసాగాలని అధికారులు ఆదేశించారు. ఇక, షాపుల వద్దే మద్యాన్ని సేవించే విధానాన్ని రద్దు చేసింది.

# సీఎం పినరయ్‌తో రాహుల్ భేటీ



తిరువనంతపురం,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ): కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపి రాహుల్ గాంధీ మంగళవారం కేరళ సిఎం పినరయి విజయన్‌తో భేటీ అయ్యారు. వారు కొచ్చిన్ హౌజ్ లో భేటీ అయి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఎన్‌హెచ్-766పై రాత్రి వేళ ట్రాఫిక్‌ను నిషేధించాలన్న అంశంపై వారు చర్చించారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వచ్చిన భారీ వరదల అనంతరం చేపట్టిన సహాయక చర్యలపై కూడా వారు చర్చించారు. వయనాడ్ అభివృద్ధికి సహకరించాలని రాహుల్ విజయన్‌ను కోరారు. రాహుల్ విన్నపానికి విజయన్ సానుకూలంగా స్పందించారు. కొచ్చిన్ హౌజ్‌లో సీఎంతో భేటీ అయ్యారు.

# యావత్ ప్రపంచం మనవైపు చూస్తున్నది

## మద్రాస్ ఐఐటీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ పిలుపు



చెన్నై,అక్టోబర్1: ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇటీవలి తన అమెరికా పర్యటనలో ఆసాంతం 'నవ భారత్' గురించి ఆశావాద దృక్పథం కనిపించిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు శాస్త్రసాంకేతిక రంగాల్లో తమదైన ముద్ర వేశారని ప్రశంసించారు. సోమవారం చెన్నైలోని మద్రాస్ ఐఐటీలో జరిగిన 56వ స్నాతకోత్సవంలో ప్రధాని పాల్గొన్నారు. ఐఐటీలోని రీసెర్చ్ పార్క్‌లో రెండురోజులపాటు నిర్వహించిన 'సింగపూర్-ఇండియా హ్యాకథాన్ 2019'లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'భారతదేశం అవకాశాల స్వర్గమంటూ ప్రపంచదేశాలన్నీ భారత్‌వైపు చూస్తున్నాయి. ఇటీవలి నా అమెరికా పర్యటనలో అనేకమంది దేశాధ్యక్షులను, పారిశ్రామికవేత్తలను, ఆవిష్కర్తలను, వ్యాపారవేత్తలను కలిశాను. మా మధ్య జరిగిన అంతర్గత చర్చల్లో అందరూ నవ భారత్ పట్ల ఆశావాద దృక్పథంతో కనిపించారు. భారతదేశ యువత సామర్థ్యంపై వారికి అపార విశ్వాసం ఉన్నది' అని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో విద్యార్థులు బయటి ప్రపంచంలోకి అడుగుపెడుతుండటం సంతోషంగా ఉన్నదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు ప్రతిరంగంలోనూ రాణిస్తున్నారని, ముఖ్యంగా శాస్త్రసాంకేతిక రంగంలో, వినూత్న ఆవిష్కరణల్లో తమదైన ముద్రవేశారని కొనియాడారు. వీరిలో ఎక్కువ శాతం మంది ఐఐటీ విద్యార్థులే కావడం విశేషమన్నారు.

దేశం గురించి ఆలోచించండి

కళాశాల నుంచి బయటికి వెళ్లే విద్యార్థులు నిర్భయంగా ముందడుగు వేయాలని మోదీ సూచించారు. 'బయట అడుగుపెట్టే సమయానికి మీకోసం ఎన్నో అవకాశాలు ఎదురుచూస్తూ ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. అయితే నాదొక చిన్న విన్నపం. మీరు ఎక్కడ? ఎలాంటి ఉద్యోగంలో ఉన్నా.. మాతృభూమిని మాత్రం మరిచిపోవద్దు. మీ శ్రమ, మీ ఆవిష్కరణ, మీ పరిశోధన ఫలితాలు మిగతా భారతీయులకు ఏదో ఒక రూపంలో సహాయపడేలా చూడండి' అని ప్రధాని కోరారు. విద్యార్థుల ఆవిష్కరణలు సామాజిక కోణంలోనే కాకుండా వ్యాపార కోణంలోనూ విజయం సాధించేలా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపేదిశగా భారత్ కృషిచేస్తున్నదని మోదీ పేర్కొన్నారు.

# నాల్గోతరగతి ఉద్యోగుల సంక్షేమానికి జైట్లీ పెన్షన్

## లేఖలో వెంకయ్యను కోరిన జైట్లీ సతీమణి

న్యూఢిల్లీ,అక్టోబర్1 (ఆర్‌ఎన్‌ఎ): తన భర్త మరణానంతరం తనకు రావలసిన పెన్షన్‌ను రాజ్యసభకు చెందిన నాలుగవ తరగతి ఉద్యోగుల సంక్షేమానికి ఉపయోగించాలని సంగీతా జైట్లీ కోరారు. ఈ మేరకు దివంగత కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ సతీమణి సంగీతా జైట్లీ రాజ్యసభ ఛైర్మన్, ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడుకు లేఖ రాశారు. జైట్లీ పెన్షన్‌ను ఈ విధంగా బడుకు ఉద్యోగుల సంక్షేమానికి ఉపయోగించడం మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళిగా ఆమె అభివర్ణించారు. జైట్లీని అజ్ఞాత దాతగా ఆమె అభివర్ణిస్తూ ఆయన జీవించి ఉన్నా తాను తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆమోదించి ఉండేవారని సంగీతా జైట్లీ లేఖలో పేర్కొన్నారు. లేఖ ప్రతిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కూడా ఆమె పంపారు. అరుణ్ జైట్లీ రెండు దశాబ్దాల పాటు రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. 66 సంవత్సరాల అరుణ్ జైట్లీ అనారోగ్యం కారణంగా ఆగస్టు 24న కన్నుమూశారు.

క్రీడలు

# తొలి టెస్టుకు భారత జట్టిదే.. పంత్‌కు నో ఛాన్స్




విశాఖపట్నం: సౌతాఫ్రికాతో తొలి టెస్టులో తలపడే భారత జట్టును బీసీసీఐ ఇవాళ ప్రకటించింది. ఊహించినట్లుగానే యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌పై వేటు పడింది. గత సిరీస్‌ల్లో బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమవుతుండటంతో అతనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో గాయం నుంచి సీనియర్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ వృద్ధిమాన్ సాహా పూర్తిగా కోలుకొని ఫిట్‌నెస్ సాధించడంతో పంత్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. సాహా చివరిసారిగా 2018 జనవరిలో సౌతాఫ్రికా టూర్‌లో టెస్టు మ్యాచ్ ఆడాడు. కెరీర్‌లో ఇప్పటి వరకు 32 టెస్టులాడిన సాహా 30.63 సగటుతో 1164 పరుగులు చేశాడు. మరోవైపు సీనియర్ స్పిన్నర్ అశ్విన్ కూడా తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. మహాత్మా గాంధీ-నెల్సన్ మండేలా ఫ్రీడమ్ ట్రోఫీలో భాగంగా మూడు టెస్టుల సిరీస్‌లో భారత్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. బుధవారం విశాఖ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టు ఆరంభం కానుంది.

భారత జట్టు:

విరాట్ కోహ్లీ(కెప్టెన్), రహానె(వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్, ఛెతేశ్వర్ పుజారా, హనుమ విహారి, అశ్విన్, రవీంద్ర జడేజా, వృద్ధిమాన్ సాహా, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమీ

# ఐపీఎల్ 2020 వేలం ఎక్కడ.. ఎప్పుడో తెలుసా?




కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-2020 సీజన్ ఆటగాళ్ల వేలానికి రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు బెంగళూరులో ఆటగాళ్ల వేలం నిర్వహిస్తూ వస్తుండగా.. ఈ సారీ కొత్త వేదిక కోల్‌కతాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే డిసెంబర్ 19న 13వ ఎడిషన్ కోసం మినీ వేలం జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే సీజన్ ఐపీఎల్ కోసం ఆటగాళ్లను బదలాయించడానికి, విడుదల చేయడానికి లీగ్ ట్రేడింగ్ విండో గడువు నవంబర్ 14తో ముగియనుంది. ఈ నేపథ్యంలో అట్టిపెట్టుకునే, విడుదల చేసే ఆటగాళ్ల జాబితాపై టీమ్‌లన్నీ కసరత్తులు చేస్తున్నాయి.

ట్రేడింగ్ విండో ఆఖరి తేదీపై ఇప్పటికే ఎనిమిది ఫ్రాంఛైజీలకు ఐపీఎల్ వెల్లడించింది. ఐపీఎల్ 2019 సీజన్ కోసం రూ.82కోట్లు కేటాయించిన ఆయా ఫ్రాంఛైజీలు.. 2020 సీజన్ కోసం రూ.85కోట్లు వెచ్చించే అవకాశం ఉంది. అదనంగా కేటాయించిన 3కోట్లతో పాటు గత ఐపీఎల్ వేలంలో వినియోగించని మొత్తాన్ని కూడా ప్రస్తుత సీజన్‌లో ఖర్చు చేసే వీలుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దగ్గర అతి తక్కువగా రూ.1.8కోట్లు మాత్రమే మిగులు నిధులు ఉండగా.. రాజస్థాన్ రాయల్స్ వద్ద అత్యధికంగా రూ.7.7కోట్లు నిధులు ఉన్నాయి.

ట్రేడింగ్ విండోను ఉపయోగించుకొని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కెప్టెన్ రవిచంద్ర అశ్విన్‌ను దక్కించుకోవాలని ఢిల్లీ క్యాపిటల్స్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరుజట్లు చర్చలు జరుపుతున్నాయి. 2018 వేలంలో అశ్విన్‌ను పంజాబ్ రూ.7.6కోట్లకు కొనుగోలు చేసి ఆ జట్టుకు సారథిగా నియమించుకుంది. అశ్విన్‌ను జట్టులోకి తీసుకోవడానికి ఢిల్లీ మెంటార్ సౌరవ్ గంగూలీ ఆసక్తిగా ఉన్నాడు. మరోవైపు రాజస్థాన్ కీలక ఆటగాడు రహానెను కూడా తమ జట్టులోకి తీసుకోవాలని ఢిల్లీ యోచిస్తోంది.

ఫ్రాంఛైజీల వద్ద మిగిలి ఉన్న నగదు వివరాలు..

సన్‌రైజర్స్ హైదరాబాద్-రూ 5.30 కోట్లు
చెన్నై సూపర్ కింగ్స్-రూ 3.2 కోట్లు
ఢిల్లీ క్యాపిటల్స్-రూ 7.7 కోట్లు
కింగ్స్ ఎలెవన్ పంజాబ్-రూ 3.7 కోట్లు
కోల్‌కతా నైట్ రైడర్స్-రూ 6.05 కోట్లు
ముంబై ఇండియన్స్-రూ 3.55 కోట్లు
రాజస్థాన్ రాయల్స్-రూ 7.15 కోట్లు
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు-రూ.1.80 కోట్లు


# కోహ్లీ రికార్డు బ్రేక్ చేసిన పాక్ క్రికెటర్




కరాచీ: శ్రీలంకతో వన్డే మ్యాచ్‌లో పాకిస్థాన్ బ్యాట్స్‌మన్ బాబర్ అజామ్(115 105 బంతుల్లో 8ఫోర్లు, 4సిక్సర్లు) శతకంతో మెరిశాడు. దీంతో లంకపై 67 పరుగుల తేడాతో పాక్ ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో అజామ్ అరుదైన ఘనత అందుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 11 సెంచరీలు చేసిన మూడో ఆటగాడిగా నిలిచాడు. టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును బాబర్ తాజాగా అధిగమించాడు. 11 శతకాలు బాదేందుకు విరాట్ 82 ఇన్నింగ్స్‌లు తీసుకుంటే.. బాబర్ కేవలం 71 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు.

సౌతాఫ్రికా క్రికెటర్ హాషీమ్ ఆమ్లా అత్యంత వేగంగా కేవలం 64 ఇన్నింగ్స్‌ల్లోనే 11 సెంచరీలు బాదిన తొలి క్రికెటర్‌గా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరో సౌతాఫ్రికా క్రికెటర్ క్వింటన్ డికాక్ 65 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించి జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఒక కేలండర్ ఇయర్‌లో వెయ్యి వన్డే పరుగులు చేసిన తొలి పాకిస్థాన్ క్రికెటర్‌గానూ బాబర్ రికార్డు నెలకొల్పాడు. మాజీ కెప్టెన్ జావేద్ మియాందాద్ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేయడంతో పాటు అత్యంత వేగంగా వెయ్యి పరుగులు సాధించిన క్రికెటర్‌గా నిలిచాడు. 1987లో 21 ఇన్నింగ్స్‌లో జావేద్ ఈ మైలురాయిని అందుకోగా.. అజామ్ కేవలం 19 ఇన్నింగ్స్‌ల్లోనే 1,000 మార్క్ చేరుకున్నాడు. గత కొన్నేండ్లుగా బాబర్ పాక్ తరఫున నిలకడగా రాణిస్తూ ఆ జట్టుకు చిరస్మరణీయ విజయాలు అందించడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నాడు.

# పీవీ సింధుతో పృథ్వీ షా ప్రాక్టీస్..!




హైదరాబాద్: టీమ్‌ఇండియా యువ క్రికెటర్ పృథ్వీ షా కొత్తగా ప్రాక్టీస్ చేయనున్నాడు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుతో కలిసి హైదరాబాద్‌లో సాధన చేయాలని నిర్ణయించుకున్నాడు. ఫుట్‌వర్క్ మెరుగుపరచుకునేందుకు వృతి విలువలు పెంపొందించుకునేందుకు షా ఈ నిర్ణయం తీసుకున్నాడు. నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నందుకు 19ఏండ్ల ముంబై క్రికెటర్ ప్రస్తుతం నిషేధం ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. నవంబర్ 15తో అతనిపై విధించిన నిషేధం తొలగిపోనుంది. ఈ నేపథ్యంలోనే అతడు సౌతాఫ్రికా, బంగ్లాదేశ్‌తో సిరీస్‌లకు దూరమయ్యాడు. ఓవరాల్ ఫిట్‌నెస్‌తో పాటు అత్యుత్తమ ఫీల్డర్‌గా మారేందుకు షా కొత్తగా కసరత్తులు చేసేందుకు సిద్ధమైనట్లు షా సన్నిహితుడొకరు తెలిపారు.

మైదానంలో షా అంత చురుగ్గా కదల్లేకపోవడంతో చాలా సార్లు విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఆ వైఫల్యాన్ని అధిగమించేందుకు బెస్ట్ ఫీల్డర్‌గా నిలువాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. తాను వర్కవుట్స్ ఎలా చేస్తానో తెలిపే వీడియోను ఇటీవల సింధు సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఫుట్‌వర్క్ మెరుగుపరచుకునేందుకు దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ రెగ్యులర్‌గా బ్యాడ్మింటన్ ఆడేవాడు. బంతిని వీలైనంత త్వరగా గుర్తించే సామర్థ్యాన్ని మెరుగుపరచుకునేందుకు మాజీ క్రికెటర్లు కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్ టేబుల్ టెన్నిస్ సాధన చేసేవారు. మాజీ క్రికెటర్ల తరహాలోనే షా కూడా ఆటలో ఉన్నతస్థాయికి చేరుకునేలా సన్నద్ధం కావాలని భావిస్తున్నాడు.

# భద్రకాళీ ఆలయంలో శరన్నవరాత్రులు

## గాయత్రీమాతగా దర్శనమిచ్చిన అమ్మవారు

వరంగల్,అక్టోబర్1(నేటినిజం ప్రతినిధి): వరంగల్ శ్రీభద్రకాళీ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతన్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం గాయత్రీ మాతగా దర్శనమిచ్చారు. వేదమంత్రోచ్ఛరణ నడుమ సహస్రకలశాభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, పసుపు, కుంకుమతో పాటు వివిధ రకాల సుగంధ ద్రవ్యలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అభిషేక ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భకత్‌ఉలు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అంతకుముందు అమ్మవారికి సింహవాహన సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయాన్ని బంతి, చామంతి, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. తొమ్మిది రోజులు ఉదయం, సాయంత్రం అమ్మవారికి వాహన సేవలతో పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో సుందరంగా అలంకరిస్తారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వెల్లడించారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లుగా వివరించారు. ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ధ్వజారోహణం, కలశస్థాపన జరిపారు. తొమ్మిదిరోజుల పాటు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఇవో తెలిపారు.

# బ్రహ్మోస్ సూపర్ సోనిక్ పరీక్ష విజయవంతం

హైదరాబాద్,అక్టోబర్ 1 (ఆర్‌ఎన్‌ఎ): బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించారు. ల్యాండ్ అటాక్ వర్షన్‌కు చెందిన బ్రహ్మోస్‌ను డీఆర్‌డీవో పరీక్షించింది. ఒడిశాలోని చాందిపుర్‌లో ఉదయం 10.20 నిమిషాలకు ఈ పరీక్ష జరిగింది. 290 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని టార్గెట్ చేసే విధంగా పరీక్షను చేపట్టారు. ప్రొపల్షన్ సిస్టమ్, ఎయిర్‌ఫ్రేమ్, పవర్ సప్లై లాంటి ఇతర భారత కంపోనెంట్లను ఈ ప్రయోగం ద్వారా పరీక్షించారు. ఈ పరీక్షతో మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ఊతమిచ్చినట్లు అవుతుంది. తొలిసారి భారత్ స్వంతంగా తయారు చేసిన పరికరాలను ఈ క్షిపణిలో వాడింది. దీంతో భారత రక్షణ వ్యవస్థ మరింత బలప డనున్నది. విజయవంతంగా బ్రహ్మోస్‌ను పరీక్షించిన డీఆర్‌డీవో బృందానికి రక్షణమంత్రి రాజ్‌నాథ్ కంగ్రాట్స్ చెప్పారు. డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ జీ సతీశ్ రెడ్డి, మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీ ఎంఎస్‌ఆర్ ప్రసాద్‌లు కూడా పరీక్ష సక్సెస్ పట్ల కంగ్రాట్స్ చెప్పారు. బ్రహ్మోస్ డైరెక్టర్ సుధీర్ కుమార్ మిస్సైల్ పరీక్షను లాంచ్ సైట్ నుంచి స్వయంగా వీక్షించారు.

# ఏడుగురికి డిఇవోలుగా పదోన్నతి

హైదరాబాద్,అక్టోబర్ 1(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో ఏడుగురు అధికారులకు డీఈవో(జిల్లా విద్యాధికారి)లుగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ డీఈవోగా ఎస్‌వీ దుర్గా ప్రసాద్, మహబూబ్‌నగర్ డీఈవోగా ఎ. ఉషారాణి, మంచిర్యాల డీఈవోగా వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం డీఈవోగా జగన్నాథ్, వరంగల్ అర్బన్ డీఈవోగా రేవతి రెడ్డి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా రోహిణి, టెట్ డిప్యూటీ డైరెక్టర్‌గా సువర్ణలత నియామకం అయ్యారు.

# రష్యా వద్ద ఆయుధాలు కొంటాం..



హైదరాబాద్, అక్టోబర్ 1: రష్యా నుంచి మిస్సైళ్ల రక్షణ వ్యవస్థకు సంబంధించిన ఎస్-400ని కొనుగోలు చేసే హక్కు భారత్‌కు ఉందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఈ విషయాన్ని వాషింగ్టన్ సమావేశంలో తెలిపారు. ఎవరి దగ్గర ఎటువంటి మిలిటరీ ఆయుధాలు కొనుగోలు చేస్తున్నామన్న విషయంలో క్లారిటీతో ఉన్నామని, అది మా సార్వభౌమాధికారం అని జైశంకర్ తెలిపారు. అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పొంపియోతో సమావేశమైన తర్వాత ఈ విషయాన్ని వెల్లడించారు. మిలిటరీ ఆయుధాలను కొనుగోలు చేసే స్వేచ్ఛ తమకు ఉన్నదన్నారు. రష్యా వద్ద నుంచి సుమారు 5.2 బిలియన్ల డాలర్లతో సుమారు అయిదు ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థకు సంబంధించిన ఆయుధాల్ని కొనుగోలు చేసేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకున్నది. అయితే రష్యా నుంచి ఆయుధాలు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా కొన్ని ఆంక్షలు పెట్టింది.

సినిమా

## సైరా చిత్రానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్.. పిటీషన్ కొట్టేసిన కోర్టు



తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం సైరా. ఈ చిత్రంపై వస్తున్న వివాదాలకి హైకోర్ట్ పులిస్టాప్ పెట్టింది. సినిమాని సినిమాలానే చూడాలి. సినిమా నచ్చేది నచ్చనిది ప్రేక్షకులకు వదిలేయాలి. గతంలో గాంధీజీ,మొగల్‌ల సామ్రాజ్యాన్ని తెరకెక్కించిన చిత్రాలను ప్రస్తావిస్తూ సైరా చిత్రలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు పేర్కొంది. ఎంతో మంది మహానుభావుల చరిత్రను ఉన్నది ఉన్నట్టు ఎవ్వరు చూపించారని కూడా కోర్టు ప్రశ్నించింది. మొదట బయోపిక్ అని ఇప్పుడు చరిత్ర తప్పుదోవ పట్టిస్తున్నారని ఇటీవల తమిళనాడు తెలుగు యువ సంఘం నాయకులు కేతి రెడ్డి పిటీషన్ దాఖలు చేయగా, దానిని కోర్టు తిరస్కరించింది. దీంతో సైరా చిత్ర బృందానికి ఉపశమనం లభించింది. అక్టోబర్ 2న సైరా చిత్రం భారీ స్థాయిలో విడుదల కానుంది.

## మూడు నెలల్లో 13 కేజీల బరువు తగ్గిన స్టార్ హీరో



ఈ కాలం నటీనటులు తాము పోషించే పాత్ర కోసం చాలా రిస్క్ చేస్తున్నారు. బరువు విషయంలో.. పెరగడం, తగ్గడం కొందరు చేస్తుంటే మరి కొందరు తమ ఆకారాన్ని మార్చుకునేందుకు కూడా సిద్ధపడుతున్నారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో విక్కీ కౌశల్.. స్వాతంత్రోద్యమకారుడు ఉధమ్ సింగ్ జీవితచరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 'సర్దార్ ఉధమ్‌సింగ్' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని విక్కీ డోనార్, పింక్, అక్టోబర్, పికు చిత్రాల దర్శకుడు సూజిత్ సర్కార్ తెరకెక్కిస్తున్నాడు.

రితేష్ షా మరియు షుబేందు భట్టాచార్య చిత్రానికి కథ అందించారు. రోన్నీ లాహరి,షీల్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2020లో విడుదల కానుంది.మూడు పదుల వయస్సు ఉన్న విక్కీ కౌశల్ 20 ఏళ్ళ స్వాతంత్రోద్యమకారుడు ఉధమ్ సింగ్ పాత్రలో కనిపించేందుకు ట్రైనర్ సమక్షంలో 13 కేజీల బరువు తగ్గాడట. ఇందుకోసం కేవలం 3 నెలల సమయం తీసుకోవడం విశేషం. ప్రతి రోజు కఠినమైన ఆహారం తీసుకుంటూ, శిక్షకుడి సమక్షంలో వర్కవుట్స్ చేస్తూ బరువు తగ్గినట్టు తెలుస్తుంది. అమృత్‌సర్‌లో 25 రోజుల షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఇక ఈ సినిమాతో పాటు కరణ్ జోహార్ తక్త్ చిత్రంలోను నటిస్తున్నాడు విక్కీ కౌశల్. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాత్రలో విక్కీ కౌశల్ కనిపించి సందడి చేయనున్నాడు. ఈ పాత్ర కోసం భారీగా బరువు పెరగాల్సి వస్తుంది. అయితే రెండు చిత్రాల షెడ్యూల్స్‌కి పెద్దగా సమయం లేకపోవడంతో విక్కీ కౌశల్ పెద్ద సవాల్‌నే స్వీకరిస్తున్నట్టు అర్ధమవుతుంది.

## ఐష్ ప్యారిస్ ఫ్యాషన్ వీక్ లుక్‌పై డిజైనర్ పంచ్

అందానికి నిలువెత్తురూపం ఐశ్వర్యరాయ్. ఎవరైన అందంగా ఉన్నామని చెప్పుకోవాలన్నా లేదంటే ఎవరైన అమ్మాయిని అందంగా ఉన్నావని ఉదహరించాలన్నా ఐశ్వర్యరాయ్‌నే గుర్తుకొస్తుంది. ఇటీవల ఐష్ ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొనేందుకు పారిస్ వెళ్లారు. లావెండర్ కలర్ దుస్తుల్లో ర్యాంప్ వాక్ చేశారు. అయితే ఐష్ దుస్తులపై ఇండియన్ ఫ్యాషన్ డిజైనర్ అయిన వెండెల్ రోడ్రిక్స్ కామెంట్ చేశారు. ప్రపంచంలోని అందమైన యువతి ఐశ్వర్యరాయ్. ఆమెకి ఇలాంటి చెత్త డ్రెస్, మేకప్‌లు వేసి అందవిహీనంగా తయారు చేశారు. ముందు వెంటనే ఆయనని తొలగించండి. అంతేకాదు హాలోవీన్ వచ్చే నెల అని ఆయనకి చెప్పండి అని కొంచెం ఘాటుగా స్పందించారు వెండెల్. ఐష్ వేసుకున్న డ్రెస్‌ని పారిస్‌కి చెందిన డిజైనర్ జియామ్ బటిస్టా వల్లీ డిజైన్ చేసిన విషయం విదితమే1994లో మాజీ మిస్ వరల్డ్ కిరీటాన్ని అందుకున్న ఐశ్వర్యరాయ్ పలు అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో సందడి చేస్తూ ఉంటుంది. వెరైటీ డ్రెస్‌లలో హోయలు పోతూ వీక్షకులని అలరిస్తూ ఉంటుంది. చివరిగా ఫ్యాన్నేఖాన్ సినిమాలో నటించిన ఐష్ ప్రస్తుతం మణిరత్నం సినిమాలో నటించేందుకు సిద్ధమవుతుంది. చోళ మహారాజు భార్య పాత్రలో నటించనున్నారు. ఆమె విలన్‌గా డబుల్ రోల్ పోషించనున్నట్లు తెలుస్తోంది.

## నరేష్ తనయుడికి బెస్ట్ విషెస్ చెప్పిన మహేష్ బాబు

బాలాజీ సనాల దర్శకత్వంలో నవీన్ విజయ క్రిష్ణ, శ్రీనివాస్ అవసరాల, మేఘ చౌదరి, సోఫియా సింగ్ ప్రధాన పాత్రలలో రూపొందిన చిత్రం ఊరంతా అనుకుంటున్నారు. రోవస్టైర్ ఎంటర్‌టైన్మెంట్స్, యుఐ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్‌పై శ్రీహరి మంగళంపల్లి, ఎ.పద్మనాభరెడ్డి నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 5న విడుదల కానుంది. ఇటీవల చిత్ర ట్రైలర్ విడుదల కాగా, ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచింది. సూపర్ స్టార్ మహేష్ బాబు తన ట్విట్టర్ ద్వారా ట్రైలర్ షేర్ చేస్తూ.. చిత్ర ట్రైలర్ చాలా బాగుంది. ప్రతి బిట్ చాలా ఎంజాయ్ చేశాను. నవీన్ విజయ కృష్ణకి శుభాకాంక్షలు అని పేర్కొన్నాడు. కె.ఎం. రాధాక్రిష్ణన్ చిత్రానికి సంగీతం సమకూర్చారు. నందిని నర్సింగ్ హోమ్ సినిమా తరువాత కొంత గ్యాప్ తీసుకుని నరేష్ తనయుడు నవీన్ ఊరంతా అనుకుంటున్నారు అనే సినిమా చేస్తున్నాడు. ఫ్యామిలీ అందరూ కలిసి చూడదగ్గ సినిమా ఇది అని మేకర్స్ అంటున్నారు.

# వరుస వర్షాలతో చెరువులకు జలకళ

### మత్తళ్లు పారడంతో రైతన్నల్లో ఆనందం

సిద్దిపేట,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ): జిల్లా వ్యాప్తంగా గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. వర్షాలు ఇలానే కొనసాగితే వాగులపైన ఉన్న చెక్‌డ్యాంలన్నీ పూర్తి స్థాయిలో పొంగిపొర్లనున్నాయి. అక్కడక్కడ చెరువులకు నీళ్లు రావడంతో కొన్ని చోట్ల మత్తళ్లు దుంకుతున్నాయి. బతుకమ్మసంబరాలకు చెరువుల్లో నీరు చేరడంతో మహిళల్లో ఆనందం తొణికిసలాడుతోంది. ఆయా మండలాల్లోని కొన్ని చెరువుల్లోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. మద్దూరు మండలంలోని కూటిగల్ నల్ల చెరువు పొంగిపొర్లుతుంది. గాగిల్లాపూర్ పెద్ద చెరువు మత్తడి దుంకేందుకు సిద్ధంగా ఉంది. అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లతండా, లక్కాకుల చెరువు మత్తడి దూకుతున్నది. హుస్నాబాద్ మండలంలోని మిర్జాపూర్ చెరువుతో పాటు సిద్దిపేట మిట్టపల్లి వల్కచెరువులతో పాటు జిల్లాలో మరికొన్ని చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. కూడవెల్లి వాగు, సిద్దిపేట మందపల్లి వాగు, ధూల్మిట్ట లింగాపూర్ వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి. చెక్‌డ్యాం పరివాహక ప్రాంత రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడేండ్ల తర్వాత సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలు నిండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని కూడవెల్లి వాగుపై నిర్మించిన 26 చెక్‌డ్యాంలకు గానూ 20 చెక్‌డ్యాంలు నిండి పరవళ్లు తొక్కుతున్నాయి. మర్కూక్ మండలంలోని చేబర్తి వద్ద ప్రారంభమై గజ్వేల్, కొండపాక, తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నర్మాల చెరువులోకి వెళ్తుంది. ఈ వాగుపైన జిల్లాలో 26 చెక్‌డ్యాంలు నిర్మాణం కాగా, చేబర్తి వద్ద మొదలైన వాగు ప్రస్తుతం గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్, లకుడారం చెరువులు నిండుకొని కొండపాక మండలంలో ప్రవేశించి తిప్పారం, సింగారం గ్రామాలుగా మీదుగా తొగుట మండలంలోకి పారుతుంది. మిరుదొడ్డి మండలంలో ని అందె, అల్వాల, మిరుదొడ్డి, మల్లుపల్లి వరకు చెక్‌డ్యాంలు పూర్తి స్థాయిలో నిండి కాసులాబాద్ చెక్‌డ్యాంలోకి నీళ్లు చేరుతున్నాయి. దు÷-దదెడ శివారులో ప్రారంభమైన అర్జున్‌పట్ల, ఆకునూరు, లింగాపూర్, ధూల్మిట్ట మీదుగా అక్కెనపల్లి పెద్దవాగు ప్రవహిస్తూ కోహెడ మండలంలోని పోరెడ్డిపల్లి వద్ద ఈ వాగును మోయతుమ్మెద వాగుగా పిలుస్తారు. బస్వాపూర్ మీదుగా శనిగరం లొద్దులనుంచి శనిగరం చెరువులోకి కలుస్తుంది. ఈ వాగు ప్రస్తుతం అర్జున్‌పట్ల - ఆకునూరు చెక్‌డ్యాం, ధూ ల్మిట్ట, లింగాపూర్, తోర్నాల చెక్‌డ్యాంలు నిండుకొని నంగునూరు మండలంలోని ఖాత చెక్‌డ్యాంలోకి నీళ్లు వచ్చి చేరాయి.

## బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

### పారిశుద్యంలో మహిళలు ముందుండాలి: కలెక్టర్

కామారెడ్డి,అక్టోబర్1 (ఆంఎన్‌ఎ): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయులకు బతుకమ్మ పండుగ ప్రతీక అని కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. బతుకమ్మ పండుగ ప్రపంచంలోనే అతి పెద్ద పూల పండుగ అని, మహిళలు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. జాగృతి ఆధ్వర్యంలో జిల్లా అంతటా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇకపోతే గ్రామాలను ఆదర్శంగా ఉంచడంలో మహిళలు ముందుండాలని కలెక్టర్ అన్నారు. 30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య పనుల్లో మహిళలు భాగస్వామ్యం కావాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు హరితహారం మొక్కల రక్షణకు చేపట్టిన చర్యలపై సర్పంచ్‌లను అభినందించారు. జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రతీ గ్రామంలో డంపింగ్ యార్డు, వైకుంఠధామాలతో పాటు కోతుల బెడద తగ్గించడం కోసం మంకీ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పవర్‌వీక్‌లో భాగంగా గ్రామాల్లోని విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇండ్ల ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. 500 జనాభా కలిగిన ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌తో పాటు ట్రాలీని అందజేస్తాన్నారు.

# గ్రామాలు పారిశుద్యంలో ముందుండాలి

### మహిళలకు తోబుట్టువుగా చీరల పంపిణీ: ఎమ్మెల్యే

జనగామ,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల బాగు కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 30 రోజుల ప్రణాళిక కార్యక్రమంతో ప్లలెల్లో మార్పు కనిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. ప్రజలు తమదిగా భావిస్తేనే గ్రామాలు బాగుపడతాయని అన్నారు. ప్రధానంగా పారిశుద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అప్పుడే దోమలను నివారించి అంటువ్యాధులను దూరంగా ఉంచగల మన్నారు. వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించి, పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టిన ప్రణాళిక పనులతో ప్లలెల రూపురేఖలు మారాలని ఆదేశిస్తే.. అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ తోబుట్టువు లాంటివారని, అందుకే ప్రతీ బతుకమ్మ పండుగకు చీరలు అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. 30 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమం, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలకు హాజరయ్యారు. సీఎం కేసీఆర్‌కు మహిళలపై ప్రత్యేక గౌరవం ఉందని, పోరాడి సాధించుకున్న తెలంగాణలో వారు సంతోషంగా ఉండాలని నాలుగేళ్లుగా బతుకమ్మ పండుగకు చీరలు అందజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని మహిళందరూ సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల కోసం ప్రభుత్వం 24 గంటల కరంట్‌ను ఉచితంగా అందిస్తుందన్నారు. పేదింటి ఆడపడుచుల కోసం కల్యాణలక్ష్మి, సాదీముబార్ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రైతులకు పంట పెట్టుబడి కోసం ఏడాదిలో రెండు పంటలకు ఎకరానికి రూ. 10 వేల చొప్పున అందిస్తున్న ఘనత ఒక్క టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వీధులను శుభ్రం చేసే బాధ్యత సర్పంచ్‌లు తీసుకోవాలన్నారు.

# ఉనికిని చాటుకునేందుకే టిడిపి పోటీ

### చావా కిరణ్మయిని రంగంలోకి దింపడంలో ఆంతర్యం ఇదే

నల్లగొండ,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ): సొంతంగా హుజూర్‌నగర్ ఉప ఎన్నికల బరిలో దిగిన టిడిపికి అవాంతరాలు తప్పేట్లు లేవు. ఇప్పటికే కేడర్ అంతా వివిధ పార్టీల్లో సర్దుకు పోయింది. క్షేత్రస్థాయిలో లీడర్లు,క్యాడర్ లేకున్నా పార్టీ అభ్యర్థిని దింపడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా కేవలం ఉనికి చాటుకోవడానికే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో అభ్యర్థులను ప్రత్యక్షంగా నిలబెడితే పట్టు పెరుగుతందని పలువురు జిల్లా నేతలు చెప్పి ఒప్పించారని సమాచారం. ఇతర పార్టీలకు మద్దత్తు ఇచ్చి తమ పార్టీ నేతల సహకారం వల్లే ఆ మాత్రం ఓట్లు పోలయ్యాయి అని చెప్పుకోవడం కూడా స్పష్టత లేని అంశంగా పరిగణించొచ్చు. ఐతే హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సరైన నిర్ణయం తీసుకుందని వారు అంటున్నారు. ముసుగులో గుద్దులాట ఎందుకనే ధోరణిలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ క్యాడర్ పట్ల రాష్ట్ర నేతలు, ఇతర నాయకులు చెప్పిన అంశాలు ఎంతవరకు వాస్తవాలో తెలుసుకోవాలంటే ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనాలి. అభ్యర్థి గెలుపోటములు, పోలైన ఓట్లను బట్టి క్యాడర్ ఎంత బలంగా ఉందో నిర్ధారణ అవుతందని అంటున్నారు. ఉప ఎన్నికలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ప్రత్యక్ష్యంగా రంగంలోకి దిగుతోంది. దీంతో పార్టీకి నిజమైన క్యాడర్ ఎంత ఉందో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. నేతలు చెప్తున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో బేరీజు వేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామస్థాయాలో ఎక్కడ చూసినా గులాబీ జెండాలు ఎగిరినంతగా ఇతర పార్టీల జెండాలు ఎగరలేక పోవడానికి పార్టీలు బలహీనపడిపోవడమేననే చర్చ జరుగుతోంది. ఇలాంటి సమయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హుజూర్ నగర్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికలో అభ్యర్థిని రంగంలోకి దించి అదృష్టంతో పాటు అంగబలాన్ని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అంచనా వేయాలనుకుంటోంది. హుజూర్ నగర్ లో ఉప ఎన్నికలో అభ్యర్ధిని రంగంలోకి దించితే ఆశించిన ఫలితం వస్తుందని, పార్టీకి ప్రజాధరణ ఉంది కాబట్టి బయటపడే అవకాశాలు ఉంటాయని, అందుకోసం చావా కిరణ్మయి సరైన వ్యక్తి అని పార్టీ ముఖ్య నేతలతో పాటు, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును ప్రభావితం చేసారని ప్రచారం సాగుతోంది. జిల్లా నేతలు ఇచ్చిన సమాచారం ఆధారంగా చావా కిరణ్మయిని చంద్రదబాబు ప్రత్యక్షంగా రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. రాష్ట్ర నాయకత్వం మొత్తం కిరణ్మయి గెలుపుకోసం కృషి చేయాల్సిందిగా బాబు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది.

### గజలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

భద్రాచలం,అక్టోబర్1(ఆర్‌ఎన్‌ఎ): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గజలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునే రామాలయం తలుపులు తెరిచి అర్చక స్వాములు స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం తదితర పూజలు నిర్వహించారు. స్థానిక చిత్రకూట మండపంలో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సామూహిక శ్రీరామాయణ పారాయణం నిర్వహించారు. శ్రీలక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించి భక్తుల సందర్శనార్ధం ఉంచారు. అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ అమ్మను ఆరాధిస్తే అధికారము, మహా సంపద కలుగుతాయని శాస్త్రం. ఈ గజలక్ష్మిని ఆరాధించే దేవేంద్రుడు త్రైలోకాధిపత్యాన్ని సాధించినట్లు పురాణంలో ఉంది. ఈ అమ్మను పూజిస్తే చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయి. మనకోసం... మనభద్రాద్రి మహాలక్ష్మి అమ్మవారు నేడు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు.

### జూరాలకు కొనసాగుతున్న వరద ఉధృతి..

జూరాల, అక్టోబర్ 1: ఎగువ ప్రాంతాల్లో నుంచి వస్తున్న భారీ వరదలకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 318. 350 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.316 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 77 వేల క్యూసె క్కులు కాగా, 70,749 క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు నివేదిక విడుదల చేశారు.

# కశ్మీర్‌పై వాదనలను ధర్మాసనం పరిశీలిస్తుంది

### తనకు సమయం లేదన్న చీఫ్ జస్టిస్

న్యూఢిల్లీ,సెప్టెంబర్30 (ఆర్‌ఎన్‌ఎ): కశ్మీర్ అంశంపై పిటీషనర్ల వాదనలు వినినేందుకు తమకు తగిన సమయం లేదని సుప్రీం సిజె జస్టిస్ రంజన్ గగోయ్ తెలిపారు. అయోధ్య కేసులో వాదనలు వింటున్నందున.. ఆర్టికల్ 370 రద్దు అంశం కేసులను పరిశీలించే టైం లేదన్నారు. అయోధ్య కేసులో రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపడుతున్నదన్నారు. అయితే కశ్మీర్‌కు చెందిన అంశాలపై జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం నుంచి విచారణ చేపట్టనున్నది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో విధించిన నిబంధనలపై సుప్రీం పిటీషన్లు స్వీకరించనున్నది. సమయం సరిపోని కారణంగా.. కశ్మీర్ అంశాన్ని ఒక రోజు ఆలస్యం విచారించనున్నారు. కశ్మీర్ అంశంపై ఏర్పాటు చేసిన బెంచ్‌లో చీఫ్ జస్టిస్‌తో పాటు మరో ఇద్దరు న్యాయమూర్తులు ఉన్నారు. అయితే వారే కశ్మీర్ అంశంపై ఏర్పాటు చేసిన బెంచ్‌లోనూ ఉన్నారు.

# 10 నుంచి లాసెట్ కౌన్సెలింగ్..

హైదరాబాద్, అక్టోబర్ 1: లాసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నది. అదేరోజు నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తోపాటు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది.

లా మూడేండ్లు, ఐదేండ్లతోపాటు, ఎల్‌ఎల్‌ఎంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరుగుతుందని లాసెట్ కన్వీనర్ ప్రొఫసర్ రమేశ్‌బాబు సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. మూడేండ్లకు 10న, ఐదేండ్లకు 13న ఉదయం తొమ్మిది గంటల నుంచి, ఎల్‌ఎల్‌ఎం అభ్యర్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సర్టిఫికెట్ల పరిశీలిన, వెబ్ కౌన్సెలింగ్ జరుగుతుంది.

కౌన్సెలింగ్ నిర్వహణకు జేఎన్టీయూహెచ్, నిజాం కాలేజీ, కేఎంఐటీ ఇంజినీరింగ్ కాలేజీ, కాకతీయ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టరేట్‌లో సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. 10న ఎన్‌సీసీ, 11న క్యాప్, పీహెచ్‌సీ వారికి కౌన్సెలింగ్ ఉంటుంది. వీరికోసం హైదరాబాద్ నిజాం కాలేజీలో, వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో సహాయకేంద్రాలు ఏర్పాటుచేశారు. పూర్తి వివరాలకు lawcetadm.tsche.ac.in కు లాగిన్ కావచ్చని కన్వీనర్ సూచించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.